honeybee.org

Vol-11 Issue-5

వెల : రూ. 20/-

సంపుటి 11 సంచిక 5 జులై-ఆగస్టు 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక









## "ఇన్‌స్పైర్" కార్యక్రమ గతి పెంచాలన్న ధ్యేయంతో

# ఎస్‌సిఇఆర్‌టి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల ఉపాధ్యాయులతో 'పల్లెసృజన' సంధానం

ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుత భారతదేశ జనాభా దాదాపు 140 కోట్లు. ఇందులో పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 26.52 కోట్లు. అంటే మన దేశ జనాభాలో దాదాపు 20 శాతం విద్యార్థులే. వీరిలో చాలా మందికి జ్ఞాపక శక్తి, పరిశీలనా దృష్టి ఎక్కువ. ఈ విషయాన్ని అవగాహన చేసుకున్న నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) పాఠశాల విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'ఇన్‌స్పైర్' పోటీలు నిర్వహించి, భారత మాజీ రాష్ట్రపతి కీ.శే. ఎపిజె అబ్దుల్ కలాం గారి జన్మ దినాన్ని 'ఇన్నోవేషన్ దే'గా పరిగణించి దేశంలోని సృజనాత్మక ఆలోచనను అందించిన చిన్నారులకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పురస్కారాలు అందజేస్తోంది. ఇందులో భాగంగా మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల ఆలోచనలను కూడా 'పల్లెసృజన' పంచుకోవటం ద్వారా ఇప్పటికి మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 26 మందికి రాష్ట్రపతి పురస్కారాలు అందేలా కృషి చేయటం జరిగింది. ఈ విషయాలను అవగాహన చేసుకున్న తెలంగాణ రాష్ట్ర "స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ & ట్రైనింగ్" (ఎస్‌సిఇఆర్‌టి) వారి సహకారంతో గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల ఉపాధ్యాయులతో 'వెబినార్' ద్వారా పల్లెసృజనతో సంధానం చేసే కార్యక్రమం నిర్వహించింది. గతిని పెంచాలని తెలంగాణ పాఠశాలల నుండి వేల సమస్యలకు ఇన్నోవేటివ్ పరిష్కారాలు రావాలన్న ఆశయంతో ఈ సంధానం అంకురించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ ఉదయం, సాయంకాలం ఒక్కో జిల్లా చొప్పున 31 జిల్లాల ఉపాధ్యాయులతో 'పల్లెసృజన' వెబినార్ ద్వారా సంధానం జరిగింది. సరాసరిన ప్రతి మీటింగ్‌కు ప్రతి జిల్లా8 నుండి 300 నుండి 350 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతే కాక హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల నుండి దాదాపు 600 మంది ఉపాధ్యాయులతో 'పల్లెసృజన' ప్రతినిధులు పాఠశాలలకు వెళ్ళి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రం లోని 20 వేలకు పైగా వున్న పాఠశాలల్లో పని చేస్తున్న 10 వేల మంది ఉపాధ్యాయులతో 'పల్లెసృజన' సంధానం జరిగి, బృహత్తర కార్యక్రమమైన 'ఇన్‌స్పైర్'కు ఊపునిచ్చింది.

ఈ వెబినార్ల లో ప్రత్యక్ష సంధాన కార్యక్రమాల ద్వారా హాజరయ్యే ఉపాధ్యాయులు చక్కగా స్పందిచారు. వెబినార్లలో పాల్గొనే చాలా మంది ఉపాధ్యాయులు తాము పునాది స్థాయి ఇన్నోవేషన్లు, వాటి వెనక వున్న ఇన్నోవేటర్ల కష్టాలు, వాటిని వెలుగులోకి తీసుకు వచ్చేందుకు పడే తపన గురించి తెలుసుకునేందుకు తమ విద్యార్థులతో కలిసి 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక సందర్శిస్తామని అన్నారు. ఇన్నోవేషన్లు అంటే ఏమిటి? సమస్యలను ఎలా గుర్తించాలి? వాటి  గురించిన పరిష్కార ఆలోచన ఎలా వస్తుంది, వాటిని ఎలా ఆలోచించాలి? ఎలా తయారు చెయ్యాలి? అనే ప్రాథమిక ఆలోచన చిన్న పిల్లల్లో కలుగుతుంది. వీటన్నిటికీ జవాబులు పల్లెసృజన అర్థవంతంగా వారి అనుభవంతో పిల్లలకు, ఉపాధ్యాయులకు చెప్ప గలిగింది. తెలంగాణ పాఠశాల విద్యార్థుల్లో 'ఇన్నోవేషన్'ల పట్ల అవగాహన పెరగటానికి ఇదో మంచి మలుపుగా భావిస్తోంది 'పల్లెసృజన'. ఇలా చేయటం వల్ల సమాజంలోని కష్టాలను గురించి తెలుసుకోవటం, వాటికి పరిష్కారాలను వెతికే దిశగా చిన్నారులు మలచ బడతారు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులు కావటానికి అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఈ సంభాషణల వల్ల రాష్ట్రంతో పాటు దేశానికి కూడా స్థానిక పరిష్కారాలకు గుర్తింపు, వాటిని విస్తృతంగా అందుబాటులోకి తెచ్చే అవకాశం వుంటుంది. ఇప్పటి వరకు 'ఇన్‌స్పైర్' పోటీలలో మన తెలుగు విద్యార్థులు, ఇతర రాష్ట్రాల విద్యార్థులు తమ ఆలోచనా విధానాల వల్ల రాష్ట్రపతి పురస్కారాలు పొందిన కథనాలు, వారి ఆలోచనలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా వారు ప్రేరణకు గురవుతారు. ఈ విధంగా చేయటం ద్వారా విద్యార్థులకు కేవలం సుఖాలు, సౌకర్యాలను గురించి మాత్రమే కాకుండా కష్టాలను చూసి, వాటికి పరిష్కారాలను వెతకటం అలవాటవుతుంది. ఈ కార్యక్రమాలన్నిటినీ విపులంగా పరిశీలన ద్వారా తెలియ జేసే సౌకర్యం కేవలం పల్లెసృజన వద్ద మాత్రమే ఉన్నదని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గత 17 సంవత్సరాలలో లక్ష మందికి పైగా విద్యార్థులతో అనుసంధానం చేయ గలిగింది పల్లెసృజన.

ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోను, ఉపాధ్యాయుల్లోను సరికొత్త పద్ధతి ద్వారా జ్ఞాన బోధన కలుగుతుందని, తద్వారా సమాజానికి ఎంతో ఉపకారం జరుగుతుందని భావిస్తోంది పల్లెసృజన. ఉపాధ్యాయుల కూడా కేవలం పుస్తకాల్లోని పాఠ్యాంశాలే కాకుండా సమాజాన్ని గురించి విద్యార్థులకు వివరించి, సమాజం పట్ల బాధ్యతగా చిన్నారులను తయారు చేసే ఒక నూతన విధానాన్ని చూడటం పట్ల వారు కూడా తమ సంతోషాన్ని, సానుకూలతను వ్యక్తం చేయటం ముదావహం. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకునే అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యా శాఖకు కృతజ్ఞతలు తెలియజేస్తోంది 'పల్లెసృజన'.





సంపుటి-11 సంచిక - 4 మే - జూన్ 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* రైతుల ప్రాణాలు కాపాడే స్ప్రేయర్ తయారు చేసిన 'దేవరపు గణేశ్' - 3
* "భారత మిల్లెట్ అంబాసిడర్" గా మారిన ఒక సామాన్య గిరిజన రైతు "లహరి బాయి" - 5
* భూమి ఉండి, వ్యవసాయం చేసుకోలేని వారికి పరిష్కార పంటను చూపిన 'పద్మారెడ్డి' - 6
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* 'పల్లెసృజన' ఆధ్వర్యంలో జరిగిన 45వ 'చిన్న శోధయాత్ర' పై యాత్రికుల అభిప్రాయాలు - 18
* పల్లె జ్ఞానం - 22
* 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత నిరంతర ప్రకృతి సేవకుడు 'వనజీవి' దరిపల్లి రామయ్య - 24
* గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన ఎంబిఎ ప్రట్టభద్రుడు బొడ్డు సుభాష్ - వినూత్న జీవన పథం - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

<u>కవర్ లోపలి పేజీలో ...</u>
"ఇన్‌స్పైర్" కార్యక్రమ గతి పెంచాలన్న ధ్యేయంతో
ఎస్‌సిఇఆర్‌టి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల ఉపాధ్యాయులతో 'పల్లెసృజన' సంధానం
<u>మధ్య పేజీలో :</u>
జులై-ఆగస్టు 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రామాలను బలోపేతం చేయటం ఎలా?

వ్యవసాయమే జీవనాధారంగా బతికే రైతుకు ఆశించినంతగా లాభాలు కనిపించటం లేదు. కారణం పెట్టుబడులు పెరుగుతున్నాయి, పనిచేసే వాళ్ళు తక్కువైపోతున్నారు. సాంప్రదాయ పంటలు తగ్గిపోతున్నాయి. వాణిజ్య పంటల వైపే మొగ్గు చూపించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయ పనులు మొక్కుబడిగా మారిపోతున్నాయి. విత్తనాలు మార్కెట్ నుండి కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పంట దిగుబడులు పెరుగుతున్నా రైతులు ఆశించిన లాభాలు రావటం లేదు. ఆ తర్వాత వాటిని తినటానికి అనువుగా విలువను జోడించే ప్రక్రియలు గ్రామాల్లో జరగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు చేయూతగా మనం ఏం చెయ్యగలం? రైతు ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాలని చెప్పటం వల్ల ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వాలు, విదేశీ ఎన్‌జిఓలు, దేశం లోని ఎన్‌జిఓలు/సిఎస్ఓలు అంతా రైతును స్వయంగా విక్రయం చేయడానికే ప్రోత్సహిస్తున్నాయి. 'పొలం నుండి టేబుల్ వరకు' అన్న నినాదంతో రైతులను మార్గదర్శకత్వం చేస్తున్నారు. ఇవన్నీ పశ్చిమ దేశాల్లో జరిగే కార్యక్రమాలు. వాటిని ఎంతో వైవిధ్యం గల మన దేశంలో ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయాలన్న ఆలోచన సమంజసం కాదు.

రైతులను వ్యాపారంలోకి లాగడం, వారికి సాంప్రదాయంగా లేని సమర్థతను డిమాండు చేయడం, టెక్నాలజీ పేరుతో మొబైల్ ఫోన్లను ఉపయోగించి సులువుగా ఉంటుందని నమ్మించే ప్రయత్నాలు - ఇవన్నీ రైతులను వారి ప్రాథమిక వృత్తి అయిన వ్యవసాయం నుండి దూరం చేస్తున్నాయి. వ్యాపారంలో స్థిరత్వం ఉండదు. తెలియని కారణాలు, అనుకోని పరిస్థితులపై లాభ నష్టాలు ఆధారపడి ఉంటాయి. రేట్లు ఎందుకు పెరుగుతాయో, ఎప్పుడు పడిపోతాయో తెలీకుండా రైతులు ఈ వ్యాపారంలో పడి అధికంగా నష్టపోతున్నారు. అయిదు సంవత్సరాల రైతు సగటు ఆదాయం గమనిస్తే అది చాలా తక్కువగా ఉండి, రైతుకు నష్టాల వైపు దారి తీస్తుందని అర్థమవుతుంది. ఏది వారి నియంత్రణలో ఉండదో అదే రైతుకు చెయ్యమని చెప్పడం వారిని నష్టాల కూపంలోకి తోయడమే.

వ్యవసాయాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. ప్రథమంగా పెట్టుబడి - విత్తనాలు, ఎరువులు, దున్నడం, కలుపు తీయడం, పురుగు మందుల వాడకం, నీరుకు ఖర్చు, పంటను కోయటం - ఇవన్నీ పెట్టుబడులు (ఇన్‌పుట్స్). వీటిని నియంత్రించే శక్తి రైతుకు ఉంది. రెండవ భాగం - వాతావరణం, అతివృష్టి, అనావృష్టి తీవ్రమైన గాలులు, తుఫానులు, అధిక ఉష్ణోగ్రత - వీటిని రైతు నియంత్రించలేడు. వీటివల్ల వచ్చే నష్టాలను అపలేడు. ఇక మూడవ భాగం - పంట దిగుబడి, దాని ధర - ఇది కూడా రైతు చేతుల్లో లేదు. వ్యవసాయం లాభకరం కావాలంటే రైతు ప్రథమ భాగంలోనే ప్రయత్నించాలి, ఇందులో పెట్టుబడిని తగ్గించేలా చూడాలి. ఉదాహరణకు వరి పండించడానికి సగటుగా రైతు ఎకరానికి 25 వేల రూపాయలు ఖర్చు అవుతాయి అనుకుంటే, ఈ ఖర్చును ఎంత తగ్గించే ప్రయత్నం చేస్తే, అంత రైతుకు చక్కగా, ఏ కష్టం లేకుండా మిగులుతాయి కదా! ఈ ప్రథమ భాగంలో ఇన్నోవేషన్‌లు చాలా ఉన్నాయి, వాటి ఉపయోగించుకోవాలి. విత్తనాలు ఊళ్లోనే తయారు చెయ్యాలి. అందుబాటులో వున్న అనువైన చేతి పరికరాలతో సేద్యపు పనులన్నీ తక్కువ శ్రమతో చెయ్యాలి. పంట కోతలు ప్రతి పంటకు వేరువేరుగా ఉంటాయి. వరి, గోధుమ, చెఱకు, పప్పులు, పూలు, కూరగాయలు, పండ్లు - ఇవన్నిటికీ సరియైన కోత పద్ధతులు, చేతి పరికరాలు లేదా పశువులతో నడిపే పరికరాలు రైతుకు అందుబాటులో ఉన్నవి ఉపయోగించాలి. ఎరువులు, పురుగు మందులు రైతులే తయారు చేసుకునే దిశగా పరిశోధనలు చేసి రైతులకు అవగాహన కల్పించాలి. పంట కోతల తర్వాత వాటిని ప్రాసెస్ చెయ్యడం గ్రామాల్లోనే జరగాలి. దీనికి కావలసిన చిన్న చిన్న యంత్ర పరికరాలు, చిన్న సన్నకారు రైతులకు అందుబాటులో ఉండేట్లుగా ఉన్న ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలి. అవసరమైన కొత్త ఆవిష్కరణలు చెయ్యాలి. వీటికి ప్రతి పంటకు, ప్రతి వ్యవసాయ ప్రాంతానికి (మన దేశంలో 126 రకాల వ్యవసాయ ప్రాంతాలు ఉన్నాయట) వేరు వేరుగా, సమయం మిగిలేట్టు, శ్రమ తగ్గేట్టు, ఉత్పాదకత మెరుగయ్యేట్లు పరికరాలు/ యంత్రాలు రైతులకు అందుబాటులో ఉండేట్టు, ఉత్తమ శ్రేణి పనితనంతో తయారు చేసి రైతులకు అందించాలి. ఈ పరిశోధనలు సాధ్యమైనంత వరకు గ్రామాల్లోనే జరగాలి. అక్కడ లభ్యమయ్యే స్థానిక వనరులు, స్థానిక సాంకేతికతతో ఆవిష్కరించాలి. వికేంద్రీకరణ సూత్రంగా పరిశోధన తయారీ సంస్థలు స్థానిక యువతీ యువకులకు ప్రోత్సాహమిచ్చి, స్థానిక నైపుణ్యాలను పూర్తిగా ఉపయోగిస్తూ ఈ ఆవిష్కరణలు చేయాలి. ఈ సందర్భంలో 'పల్లెసృజన' వెతికి వెలుగులోకి తెచ్చిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ఉపయోగకరంగా ఉంటాయి. గ్రామాల్లో ఇది సాధ్యమని నిరూపించబడ్డాయి. ఆత్మనిర్భరత లక్ష్యంగా గ్రామ స్వయం సమృద్ధికి ఒక ప్రణాళికతో ఈ కార్యక్రమాలు అమలు పరచాలి. పల్లెసృజన ముందునుంచి ఈ విషయాన్నే చెబుతూ వస్తోంది.



గ్రామాల్లో నిరుద్యోగం ఎక్కువైందని, గ్రామ ప్రజలు పట్టణాలకు వలస పోవడం అధికమైందన్న చర్చలు తరచుగా వింటూ ఉంటాం. దానికి "ఉపాధి హామీ పథకాలు" రైతు బంధు, దళిత బంధు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామ ప్రజలకు అందిస్తున్నారు. పల్లెసృజన దృష్టిలో ఇవి గ్రామ స్వయం సమృద్ధికి తోడ్పడవు. రైతుల శక్తిని పెంచడానికి, వారి పెట్టుబడులు తగ్గించడానికి పనికి రావు. గ్రామాల శక్తులను పెంపొందించాలి. వారి శక్తులను శక్తివంతం చేయాలి. పైన చెప్పినట్లుగా రైతుల సేద్యపు పనులకు సరళమైన, అందుబాటులో ఉండే అత్యంత నైపుణ్యమైన పరికరాలను అందించాలి. ఇవన్నీ స్థానిక నైపుణ్యంతో, యువతతో చేయించాలి కాని, ఉచితాలతో కాదు. అప్పుడే గ్రామాల్లో నిరుద్యోగ సమస్య తగ్గుముఖం పడుతుంది.

మరోమాట. గ్రామాల్లో ఉపాధి కల్పనకు కొత్త ఆలోచనలు చేయాలి. ఉదాహరణకు తోటలో పండ్లు, కాయలు, త్రెంపడానికి, పూలు కోయటానికి, పప్పు దినుసులను నూర్పిడి చేయడానికి, స్థానిక యువతీ యువకుల బృందాలను తయారు చేయాలి. ఇలా చేస్తే ఏ రైతుకు అవసరమైన పనులకు సహాయకారిగా ఉంటుంది. ఈ మధ్య వరినాట్లు వేయటానికి ఇతర రాష్ట్రాల నుండి కాంట్రాక్టు పద్ధతిలో కూలీలు వస్తున్నారు. వాళ్ళు చేస్తున్నదేంటంటే, 'వరినాటడం' అన్న రైతు అవసరాన్ని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌గా గ్రామాలకు అందిస్తున్నారు. ఇదే రీతిలో రైతులకు కావలసిన అన్ని సేద్యపు పనులు స్థానిక యువత గ్రూపులుగా తయారై రైతులకు అందించాలి. ఒకే బాణంతో రెండు పిట్టలను కొట్టినట్లుగా ఇలాంటి ప్రణాళికతో రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గించడం, పని సవ్యంగా సమయానికి చేయడం, నిరుద్యోగ సమస్యను గ్రామ యువతకు పని కల్పించడం - అన్నీ సాధ్యం చేయవచ్చు

పై రీతిగా రైతే కేంద్రంగా సమాజం ఆలోచించకపోతే రైతులు వ్యవసాయాన్ని విడిచి పెట్టి వలసపై అధిక భాగం మోజు పెంచుకుంటారు. అప్పుడు దేశం "ఆహార కొరత"ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మనం మరచిపోకూడని మాట - సత్యం కూడా - ఏమిటంటే ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామ ప్రజలు, రైతులు పట్టణ వాసులకు, ధనవంతులకు సబ్సిడీ ఇస్తున్నారు. రైతులకు మనం సబ్సిడీ ఇవ్వటం లేదు. మనం రైతు దయాదాక్షిణ్యాలపై జీవిస్తున్నామన్న సత్యాన్ని అంగీకరించి గ్రామాలపై మనకున్న దృక్పథానికి 'యు-టర్న్' ఇవ్వాలి. గ్రామాలు అడుగు లేని బావులు కావు, అవి ప్రకృతి వనరులతో పునరుత్పత్తితో నిండిన అంతం లేని వనరులు. అందుకే పల్లెసృజన పూర్తిగా నమ్మే నిజం

"పట్టణాలు మానవుడు తయారు చేస్తాడు

గ్రామాలు భగవంతుడు సృష్టించాడు".

మనకు రెండూ కావాలి. వాటిని కాపాడుకోవడం మనందరం ఒక బాధ్యతగా, కర్తవ్యంగా ఒప్పుకోవాలి. ఆచరణలో పెట్టాలి. మన సమాజాన్ని భావి తరాలకు అందంగా, ఆనందంగా, సస్యశ్యామలంగా, వారసత్వంగా ఇవ్వాలి. "లోకాస్సమస్తా సుఖినోభవంతు"

భవదీయ

బ్రిగేడియర్ పోగులు గణేశం (రిటైర్డ్)

# రైతుల ప్రాణాలు కాపాడే
# స్ప్రేయర్ తయారు చేసిన 'దేవరపు గణేశ్'



- వీరరాఘవ రెడ్డి

పచ్చని పైరుకు పట్టిన చీడను చంపక తప్పదు రైతు. లేదంటే ఆ చీడ పైరును మొత్తం తినేసి రైతుకు నష్టం చేకూరుస్తుంది. పూర్వం వ్యవసాయంలో పురుగు మందుల వాడకం చాలా తక్కువ ఎందుకంటే అప్పట్లో గల కలుషితం లేని వాతావరణం కారణంగా పొలంలో మిత్ర పురుగులు దేశానికి సైనికుల్లా ఆ చేను పంటను కాపాడుతూ ఉండేవి. ఇక్కడ ఇంకో విచిత్రాన్ని రైతులు గమనించాలి. రైతుకు నష్టం చేకూర్చే పురుగులు 'శాఖాహారులు'. అవి పంటలను మాత్రమే తిని బ్రతుకుతాయి అందువల్ల రైతుకు నష్టం చేకూరుతుంది. కానీ మిత్ర పురుగులు 'మాంసాహారులు'. ఇవి పైరుకు పట్టిన చీడ పురుగులను తిని జీవిస్తాయి. అలా చేయటం వల్ల తమ బ్రతుకుతో పాటు, రైతుకు మేలు చేకూరుస్తాయి. చాలా విచిత్రంగా ఉంది కదూ!

పంటలను కాపాడుకోవాలంటే పురుగు మందులు ఉపయోగించక తప్పని పరిస్థితి రైతుది. దేశం లోని కొద్ది శాతం మంది రైతులు సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకున్న పురుగు మందులు, కషాయాలను పిచికారి చేసుకునే వారికి ఎటువంటి హాని జరగదు. కానీ రసాయన పురుగు మందులను పిచికారి చేసే అధిక శాతం మంది రైతులు పంట పొలంలో పురుగులు చనిపోతాయో లేదో కాని, కొంతమంది రైతులు మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోక పోవటం వల్ల అనారోగ్యానికి, అపాయానికి గురై కొందరు రోగాల బారిన పడితే, మరి కొందరు ప్రాణాలనే విడవాల్సి వస్తోంది. ఇందుకు కారణం రైతు పంటను చూస్తూ స్ప్రేయర్ తో పురుగు మందును పిచికారి చెయ్యటం, అంతే కాక తాను పురుగు మందు తుంపర్లలో నడవటం వల్ల రైతు పురుగు మందు పీల్చుకొని, మరణాలు కూడా జరుగుతున్నా ఇందుకు పరిష్కారాన్ని మాత్రం ఎవ్వరూ గుర్తించడం లేదు, కనీసం చీమ కుట్టినట్లయినా అనిపించటం లేదు.

> పిచికారి చేస్తున్న సమయం లో పురుగు మందు పొలం మీద పడటం తో పాటు ఆ రైతు పైన కూడా పడటం గమనించాడు. ఇది చాలా పెద్ద సమస్య రసాయనిక పురుగు మందులు పడటం వల్ల పిచికారి చేసిన వ్యక్తి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. పురుగు మందు తుంపరలు కళ్ళ ల్లోకి, ముక్కులోకి వెళ్ళటం వల్ల అస్వస్థతకు గురౌతారు.

ఈ విషయాన్ని గమనించిన ఒక రైతు బిడ్డ దీనికి ఒక ఉపాయాన్ని కనుగొని, పురుగు మందు పిచికారి చెయ్యటంలో క్షేమంగా, ఎటువంటి హాని జరగకుండా ఉన్న స్ప్రేయర్‌కే కొన్ని మార్పులు చేశాడు ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం సమీపంలో గల మత్స్యపురి గ్రామానికి చెందిన దేవరపు సాయి కుమారుడు 21 సంవత్సరాల "దేవరపు గణేశ్".

గణేశ్ తండ్రి వ్యవసాయ కూలీతో జీవనం సాగిస్తూ, ఒక రెండెకరాల పొలం కౌలుకు తీసుకుని స్వంతంగా వ్యవసాయం కూడా చేస్తూ ఉంటాడు. గణేశ్‌కు పాఠశాల విద్యాభ్యాసం చేసే రోజుల నుండే ఏదైనా కొత్త వస్తువులను తయారు చేయటం, ఎలక్ట్రిక్ వస్తువులతో ప్రయోగాలు చెయ్యటం, వ్యవసాయం అంటే ఎంతో ఆసక్తి. అప్పట్లోనే తన తండ్రి ధాన్యం నూర్పిడి చేసిన తర్వాత వాటిని ఆరబెట్టేందుకు కాలితో ధాన్యాన్ని దున్నటం లో పడుతున్న కష్టాన్ని చూసి ఆయనకి ఉపయోగ పడేలా ఒక చిన్న పరికరాన్ని తయారు చేసి ఇచ్చాడు. అప్పటి నుండి వ్యవసాయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి, వాటిని పరిష్కరించేందుకు కూడా ఆవిష్కరణలు చెయ్యాలని సమస్యలను అధ్యయనం చేయటం మొదలు పెట్టాడు.

ఇలా తన ఆలోచనలు సాగుతుండగా, డిగ్రీ రెండో సంవత్సరంలో ఉన్నపుడు గణేశ్ పక్క పొలంలో ఒక రైతు స్ప్రేయర్‌తో పురుగు మందు పిచికారి చేస్తున్నపుడు ఆయన పడుతున్న ఇబ్బందిని గమనించాడు. పిచికారి చేస్తున్న సమయంలో మందు పొలంమీద పడటంతో పాటు ఆ రైతు పైన కూడా పడటం గమనించాడు. ఇది చాలా పెద్ద సమస్య రసాయనిక పురుగు మందులు పడటం వల్ల పిచికారి చేసిన వ్యక్తి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. పురుగు మందు తుంపరలు కళ్ళల్లోకి, ముక్కులోకి వెళ్ళటం వల్ల అస్వస్థతకు

గురవుతారు. శరీరం పైన పడటం వల్ల చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఈ తుంపరలు మరీ ఎక్కువగా మనిషిపై పడితే ప్రాణాలు కూడా కోల్పో వలసి వస్తుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ప్రస్తుతం వస్తున్న హానికర రసాయనాల వల్ల ఈ ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం కనుగొనాలని ఆలోచించిడం మొదలు పెట్టాడు గణేశ్. ప్రస్తుతం మారిన టెక్నాలజీ వల్ల పురుగు మందు పిచికారి చేసేందుకు రిమోట్ సహాయంతో పని చేసే 'డ్రోన్స్' వచ్చాయి కానీ, అవి అందరు రైతులకు అందుబాటులో ఉండవు. ఒక రోజు గణేశ్ తండ్రి మందు పిచికారి చేసి వచ్చిన తర్వాత ఊపిరి తీసుకోవటంలో చాలా ఇబ్బంది పడటం గమనించాడు. దీనికి పరిష్కారం ఎలాగైనా చూడాలని ఆలోచిస్తుండగా ఒక ఉపాయం తోచింది.

మందు పిచికారి చేసేటపుడు రైతు స్ప్రేయర్‌ను భుజాన వేసుకుని నాజిల్ కడ్డీని అటు ఇటూ కదిలిస్తూ పంటపై పురుగు మందు పడేలా చూసుకుంటూ ముందుకు వెళ్తుంటాడు. అలా చేయటం వల్ల ఒక్కోసారి ఎదురు గాలి వచ్చినపుడు ఆ పురుగు మందు రైతు మీదనే పడుతుంది. కాబట్టి ఆ మందును వెదజల్లే నాజిల్‌ను వెనక వైపున అమరిస్తే, రైతుపైన పడదు కదా అనుకున్నాడు. వెనక నుండి గాలి వచ్చినపుడు మందు రైతు మీదకు వచ్చినా వెనక వైపున కాబట్టి పెద్దగా ప్రమాదం ఉండదు. ఒకవేళ మరీ ప్రమాకరమైన మందు అయితే కొన్ని రకాల చర్మవ్యాధులు వచ్చే అవకాశం వుంటుంది. ముఖానికి, నోట్లోకి, ముక్కుల్లోకి మందు వచ్చే అవకాశం లేదు కాబట్టి చాలా వరకు ప్రమాదాన్ని అరికట్టవచ్చు కదా అని ఆలోచించాడు. పైగా ఇలా ఏర్పాటు చేయటం వల్ల రైతు చేతితో నాజిల్‌ను అటూ, ఇటూ కదిలించాల్సిన అవసరం లేదు కాబట్టి రైతు చేతికి కొంత శ్రమ కూడా తగ్గుతుంది.

ఇలా ఆలోచనైతే వచ్చింది కానీ, దాన్ని తయారు చేసే ఆర్థిక స్థోమత తనవద్ద లేదు, కూలి పనికి వెళ్తేగాని పూట గడవని పరిస్థితి కాబట్టి తండ్రిని కూడా అడగలేదు. ఎలాగైనా ఈ స్ప్రేయర్ తయారు చెయ్యాలని అనుకుని తన మిత్రుల ద్వారా 5 వేల రూపాయలు అప్పుగా తీసుకుని అవసరమైన సామాగ్రి కొనుగోలు చేశాడు. ఈ స్ప్రేయర్ కోసం ఒక స్ప్రేయర్ ట్యాంక్, 4 నాజిళ్లను తీసుకున్నాడు. పురుగు మందు ఎక్కువ పీడనంతో పిచికారి జరగాలని డబుల్ మోటార్ మరియు 12 వోల్టులు, 14 ఆంఫియర్ బ్యాటరీ తీసుకొని తన ఆలోచనకు తగ్గట్టు స్ప్రేయర్‌కు మార్పులు చేశాడు.

స్ప్రేయర్ వెనక భాగంలో 2 అడుగుల ఇనుప కడ్డీలు రెండు






బిగించి, వాటికి నాజిళ్లను అమర్చి స్ప్రేయర్ తయారు చేశాడు. మొదటి ప్రయత్నంలోనే (20/10/2021 నాడు) తన ప్రయోగం విజయవంతం అయింది. పొలంలో పరీక్షించి చూడగా చాలా అద్భుతంగా పని చేసింది. స్ప్రే చేసే వ్యక్తిమీద మందు ఏమాత్రం పడలేదు, స్ప్రే చేసేందుకు చేతిని అటు ఇటు కదల్చాల్సిన అవసరం లేదు. వెనక వైపున ఏర్పాటు చేసిన 4 నాజిళ్ల ద్వారా దాదాపు 10 అడుగుల వెడల్పులో పురుగు మందు పిచికారి అవుతుంది. పిచికారి చేసే పంట అవసరాన్ని బట్టి నాజిళ్ల ఎత్తును సులభంగా మార్పు చేసుకోవచ్చు. ఈ స్ప్రేయర్ ద్వారా వరి, మొక్కజొన్న, కూరగాయ పంట, వేరుశనగ, ప్రత్తి లాంటి దాదాపు అన్ని రకాల పంటలపై పిచికారి చేయవచ్చు.

ప్రస్తుతానికి ఈ స్ప్రేయర్ ఒక్కటి మాత్రమే తయారు చేశాడు, దీన్ని తన తండ్రి ఉపయోగిస్తున్నాడు. ఈ స్ప్రేయర్ ఆయనకు ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఈ స్ప్రేయర్‌ను చూసిన చుట్టు ప్రక్కల రైతులు చాలా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. వారికి కూడా ఇలాంటి స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వమని అడుగుతున్నారు. తనకున్న ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను తయారు చేయలేక పోతున్నాడు. తగిన ఆర్థిక సహాయం అందించ గలిగితే ఈ స్ప్రేయర్లను తయారు చేసి ఇవ్వగలను అంటున్నాడు ఈ యువ ఇన్నోవేటర్ దేవరపు గణేశ్.

గణేశ్ తయారు చేసిన స్ప్రేయర్‌లను అధిక సంఖ్యలో తయారు చేసి రైతాంగానికి 5–6 వేల ఖరీదులోనే విరివిగా లభించేలా చేసేందుకు 'పల్లెసృజన' ప్రయత్నాలు చేస్తోంది. వీలైనంత త్వరలో ఈ స్ప్రేయర్ రైతాంగానికి అందుబాటు లోకి వస్తుందని ఆశిద్దాం. ●

**వివరాలకు సంప్రదించండి, సుభాష్, ఫోన్ : 9652801700**



## "భారత మిల్లెట్ అంబాసిడర్" గా మారిన ఒక సామాన్య గిరిజన

# రైతు "లహరి బాయి"

మధ్యప్రదేశ్ లోని 'బైగా గిరిజన' ప్రాంతానికి చెందిన 25 సంవత్సరాల ''లహరి బాయి''కి చిన్నప్పుడు తన సోదరుడి సహాయంతో తృణ ధాన్యాలు, చిరు ధాన్యాలు మనిషి ఆరోగ్యానికి ఎంతగా ఉపయోగ పడతాయో, వాటిని అంతరించి పోకుండా ఎలా కాపాడుకోవాలో అన్న విషయాలను తన మదిలో నిక్షిప్తం చేసుకుంది లహరి బాయి.

పెళ్ళయిన తర్వాత తనకున్న కొంత పొలంలో 16 రకాల అంతరించి పోతున్న చిరు ధాన్యాల విత్తనాలను పండించేది. అందులో ధాన్యపు గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు ఉన్నాయి. అన్ని కూడా దేశీయ రకానికి చెందినవే కావడం గమనార్హం. ఇలా ఆమె గత పది సంవత్సరాలుగా చేస్తూనే ఉంది. వాటిని పండించటం, నూర్పిడి చేయుటం, ఇంట్లో పదిలంగా భద్రపరచి తన తోటి రైతులకు పంచడం వల్ల వాటిని విస్తరింప జేస్తోంది. ఈ విత్తనాలలో లావుగా (దొడ్డుగా) ఉండే విత్తనాల విషయంలో లహరి బాయికి చాలా పరిజ్ఞానం ఉంది.

ఈ విత్తనాలను ఆమె తన సమీప గ్రామాలు, లేదా ఏదైనా ఊరికి వెళ్ళినపుడు ఆ ప్రాంతంలో లభించే దేశీ విత్తనాలను గురించి తెలుసుకొని, వాటిని కొద్ది ప్రమాణంలో (5–10 గింజలు అయినా సరే) సేకరించి, వాటిని పునరుత్పత్తి చేయటం ఆమె అలవాటుగా చేసుకుంది. ఇలా ఇప్పటికి ఆమె 150కి పైగా దేశీ విత్తనాలను సేకరించి, ఉత్పత్తి చేసి, తోటి రైతులకు అందజేస్తోంది. ఇంత కష్టపడి విత్తనాలు సేకరించి, వాటిని పునరుత్పత్తి చేసి, తోటి రైతులకు అందజేయటం మీకు కష్టంగా లేదా? అని అడిగితే దానికి లహరి బాయి "లేదు నాకు ఇంకా చాలా ఆనందంగా ఉంటుంది. ఈ విత్తనాలు నేను సేకరించి, ఉత్పత్తి చేసి, తోటి రైతులకు అందిస్తున్నాను కదా అని గర్వంగా ఉంటుంది'' అంటుందామె. "దేశీ విత్తనాలు చాలా వరకు అంతరించి పోతున్నాయి. వాటిని కాపాడితే దేశానికి చాలా మంచిది. వీటి వల్ల ప్రజలకు ఎంతో ఆరోగ్యం చేకూరుతుంది" అంటోందామె.

లహరి బాయి చేస్తున్న కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని "అంతర్జాతీయ మిల్లెట్ పంటల ప్రత్యేకం"గా ప్రకటించటంతో ఈమెను అంతర్జాతీయ స్థాయిలో "భారత దేశ బ్రాండ్ అంబాసిడర్"గా నియమించింది. ఈమె చేసే కార్యక్రమాలు భారత దేశ యువతకు ఒక స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఈమె దేశానికే ఒక ఉదాహరణగా తయారైంది. ఒక సామాన్య కుటుంబానికి చెందిన గిరిజన యువతి ఇంతటి ఖ్యాతిని సాధిస్తే 'మనమేమీ చేయలేమా?' అన్న ప్రశ్న ప్రతి రైతులో ఉదయిస్తుంది. ఇంతటి ఖ్యాతిని పొందిన 'లహరి బాయి'ని మనస్ఫూర్తిగా అభినందిస్తోంది "పల్లెసృజన".

వివరాలకు వీక్షించండి : https://newsonair.com/2023/02/09/pm-modi-lauds-lahari-bai-the-brand-ambassador-of-millets/

















## భూమి ఉండి, వ్యవసాయం చేసుకోలేని వారికి

# పరిష్కార పంటను చూపిన 'పద్మారెడ్డి'

- వీరరాఘవ రెడ్డి


ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని చాలా గ్రామాల్లో ఎక్కువ కమతాల భూమి వున్న రైతులు చాలా మంది ఉన్నారు. ఎక్కువ పొలం ఉంది అంటే వారి ఆర్థిక పరిస్థితి కూడా బాగా ఉంటుంది అనుకుంటూ ఉంటారు చాలా మంది. ఈ ఊహ కొంత వరకు నిజమే. ఎక్కువ పొలం ఉండటం వల్ల తాము స్వంతంగా వ్యవసాయం చేసుకోలేక, కూలీలు లభించక, భూమినే నమ్ముకున్న కుటుంబాలు కాబట్టి వాటిని అమ్ముకోవటానికి మనసు రాక, ఎప్పటికైనా మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తున్న వారు కూడా ఉన్నారన్నది వాస్తవం.

ఇటువంటి వారి కోసం అన్నట్లుగా నల్గొండ జిల్లా, చందంపేట మండలం, పోలేపల్లి వాస్తవ్యులు 'లోకసాని పద్మారెడ్డి' అనే రైతు చేసిన ఒక ప్రయోగం ఆచరణీయం అనిపించే విధంగా తన పొలాన్ని సస్యశ్యామలం చేసుకోవటమే కాదు, అధికంగా ఆదాయాన్ని కూడా తక్కువ కష్టంతో పొందుతున్నాడు. తన చిన్న తనంలోనే ఎన్నో కష్ట నష్టాలను చవి చూసి, రెండుసార్లు అతి పెద్ద ప్రమాదాలు జరగటం వల్ల ఒక కాలు పాదం బాగా దెబ్బ తిని పాక్షికంగా వికలాంగుడిగా కూడా అయ్యాడు. కానీ తాను పడిన ప్రతి కష్టం నుంచి ఒక్కో జీవిత సత్యాన్ని తెలుసుకుని, ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచాడు పద్మారెడ్డి. తాను పడ్డ బాధలు ఇంకెవ్వరూ పడ కూడదు అని తన పరిధిలో రైతులకు ఎంతో కొంత సహాయ పడ గలిగితే చాలు అనుకున్నాడు.

తన జీవితం ఇలా సాగుతున్న సమయంలో ఒకసారి తాను పొలాలకు వెళ్ళి వస్తున్నపుడు వర్షం పడటంతో ఒక చెట్టు క్రిందకు చేరి నిలబడ్డాడు. అది కుంకుడు కాయల చెట్టు. ఆ చెట్టు చుట్టూ కంచె వేయబడి ఉంది. ఈ కుంకుడు కాయల చెట్టు చుట్టూ కంచె ఎందుకు వేశారబ్బా అని ఆలోచిస్తుండగానే అక్కడికి ఆ పొలం యజమాని కూడా వర్షం నుండి రక్షించుకునేందుకు ఆ చెట్టు క్రిందకు వచ్చాడు. మాటల మధ్యలో ఎందుకు ఈ చెట్టు చుట్టూ కంచె వేశావని అడిగాడు. అందుకు ఆ పొలం యజమాని "ఏమీ లేదండి ఈ చెట్టు కుంకుడు కాయలు వాటంతట అవే రాలి క్రింద పడిపోతాయి, ఈ కంచె వేయకుంటే పశువులు, ఇతరులు ఎవరైనా చెట్టు క్రిందకు వచ్చి వాటిని చెల్లా చెదురుగా చేస్తారు కాబట్టి వాటిని కాపాడుకునేందుకు ఈ కంచె వేశాను" అన్నాడు.

"ఈ కుంకుడు కాయలు ఏమి చేస్తావు" అని అడిగాడు పద్మారెడ్డి. అందుకతను "ఇవన్నీ రాలిపోయిన తర్వాత వాటిని సేకరించి కాస్త తూర్పారబట్టి ఉంచితే కొందరు వ్యాపారులు వచ్చి వీటిని కొనుక్కొని వెళ్తారు" అన్నాడు. "ఎంతకు అమ్ముతావు?" అని అడిగాడు పద్మారెడ్డి. అందుకా యజమాని "కిలో 10 రూపాయల చొప్పున అమ్ముతాను. ఈ చెట్టుకు ఒకటి నుండి ఒకటిన్నర క్వింటాళ్ళకు పైగానే కుంకుడు కాయలు క్రింద రాల్తాయి. నేనేమీ దీని కొరకు ప్రత్యేకమైన పోషణ అంటూ ఏమి చేయటం లేదు కదా, ప్రతి సంవత్సరం వెయ్యి నుండి రెండు వేల దాకా ఆదాయం ఇస్తుంది కదా అని ఈ చెట్టును అలాగే ఉంచాను, ఇది తనకు ఆదాయంతో పాటు మంచి నీడను కూడా ఇస్తుంది కదా" అన్నాడు.

అప్పుడు ఆలోచించాడు ఇదేదో బాగానే ఉంది కదా, ఎటువంటి శ్రమ లేకుండా ఆదాయం సమకూరుతోందే అనుకున్నాడు. ఇలా కొంత కాలం గడిచిన తర్వాత తన పొలంలో కొంత భాగం సీతా ఫలం, నిమ్మ, బత్తాయి చెట్లు నాటుదాము అనుకొని ఒక నర్సరీకి వెళ్ళి తనకు కావలసిన చెట్లను కొనుగోలు చేసుకుని, వాటిని లారీలో ఎక్కించుకుని తిరిగి వస్తూ ఉండగా ఆ నర్సరీ గేటు పక్కన కొన్ని మొక్కలు వృధాగా పడేయటం గమనించి, "ఇవేమి మొక్కలు ఇలా పారవేశారు?" అని అడిగాడు నర్సరీ యజమానిని. అందుకా యజమాని అటవీ శాఖ వారు కుంకుడు మొక్కలు పెంచి ఇవ్వమని అడిగితే వాటిని పెంచాము. కానీ ఎన్ని రోజులైనా వారు తీసుకోక పోవటంలో అనవసరంగా స్థలం వృధా అవుతోంది అని వాటిని పారవేయ లేక, ఇక్కడ పెట్టాము" అన్నాడు. వెంటనే పద్మారెడ్డికి తాను గతంలో కుంకుడు చెట్టు యజమాని చెప్పిన విషయం గుర్తుకు వచ్చి "వీటిని నాకు ఇస్తావా?" అని అడిగాడు. అందుకు ఆ నర్సరీ యజమాని "లక్షణంగా తీసుకు వెళ్ళండి లోడింగ్ ఖర్చు కూడా ఇవ్వాల్సిన పనిలేదు, నాకు స్థలం వస్తే చాలు" అని వాటిని పద్మారెడ్డి తీసుకున్న చెట్ల లారీలో ఎక్కించాడు.







అలా తీసుకు వచ్చిన కుంకుడు చెట్లు దాదాపు 1200 ఉన్నాయి. ఎకరాకు 100 చెట్ల చొప్పున 12 ఎకరాల్లో వాటిని నాటించాడు. తన ఊరివారు, మిత్రులు వచ్చి ఈ కుంకుడు చెట్ల తోట చూసి "నీకేమైనా పిచ్చా ఎవరైనా కుంకుడు చెట్లు నాటుకుంటారా? ఇంకే చెట్లు దొరకలేదా నీకు. ఏదో కుంకుడు చెట్లు చేలో ఒకటి రెండు వేసుకుంటే చాలు ఇలా తోట ఎవరైనా పెడతారా పటేలా?" అని ఎగతాళి చేశారు. కానీ తాను అనుకున్నది వేరు, తన ఆలోచన వేరు. తాను వేరే ఏ చెట్లు పెట్టినా వాటికి అందించ గలిగేంత నీటి లభ్యత తనవద్ద లేదు. ఇవైతే నీరు పెట్టాల్సిన పని లేదు, మొండి చెట్టు కాబట్టి బతికి పోద్దిలే అనుకున్నాడు. ఆ కుంకుడు చెట్ల మధ్యలో మునక్కాయ చెట్లను కూడా నాటడం జరిగింది. ఒక మూడు సంవత్సరాల పాటు మునక్కాయలు మంచి రేటు రావటంతో వాటి నుంచి బాగా ఆదాయం లభించింది. ఆ తర్వాత మునగ చెట్లు మూడేండ్లకు పైగా కావటం, కుంకుడు చెట్లు పెరగటంతో అప్పటికే మునగలో మంచి ఆదాయం లభించింది కనుక మునగను తీసివేయటం జరిగింది.

అప్పుడే కుంకుడు చెట్లు కాయలు కాయటం మొదలైంది. వాటిని సేకరించగా అవి సరాసరిన ఒక్కో చెట్టుకు 30 కిలోల దాకా వచ్చాయి, మొత్తంగా మూడున్నర లక్షల దాకా ఆదాయం వచ్చింది. తాను కుంకుడు చెట్లకు నీరు పెట్టింది లేదు, పొలంలో సేద్యం చేసింది లేదు, వాటిని కాపాడేందుకు ఎరువులు వెయ్యలేదు, పురుగు మందులు కొట్ట లేదు ఉట్టి పుణ్యానికి మూడేళ్ళు కాగానే మూడున్నర లక్షల ఆదాయం వచ్చింది అని సంతోష పడ్డాడు. ఆ తర్వాత ఇటీవల వచ్చిన కరోనా సమయంలో కుంకుడు కాయలు ఏరించే సమయం కూడా లభించలేదు. అప్పుడే ఒక వ్యాపారి తనవద్దకు వచ్చి "పటేలా మీవద్ద కుంకుడు కాయలు ఉన్నాయట కదా నాకు 2-3 క్వింటాళ్ళు కావాలి ఇవ్వండి" అని అడిగాడు. ఎందుకో ఏమో చూద్దామని "ఎలా ఉంది రేటు అన్నాడు" పద్మారెడ్డి. అందుకా వ్యాపారి "కిలో 50 రూపాయల చొప్పున తీసుకుంటాను" అన్నాడు. తనకు ఆశ్చర్యం వేసి "ఇప్పుడేమీ లేవులే" అన్నాడు పద్మారెడ్డి. "ఎలాగైనా ఒక క్వింటాలన్నా ఇవ్వండి, కిలోకి 70 రూపాయలు ఇస్తాను" అన్నాడు వ్యాపారి. అప్పుడు పద్మారెడ్డికి ఆశ్చర్యం వేసి, అదేంది తానేమో పది రూపాయలకు కిలో ఇస్తున్నాను, ఇతనేమో 70 రూపాయలు ఇస్తాను అంటున్నాడు, ఇదేదో మతలబు ఉన్నట్లుంది అని అనుకుని అతన్ని తర్వాత రమ్మని చెప్పాడు. ఇంతలో ఒకసారి హైదరాబాద్‌కు రావటం, అక్కడ సూపర్ మార్కెట్‌లో కుంకుడు కాయల రేటు విచారించగా కిలో 250 రూపాయల లాగా అమ్ముతున్నారు. ఒక హోల్‌సేల్ వ్యాపారి వద్దకు వెళ్ళి విచారించగా, అతను కిలో 150 నుండి 170 రూపాయల దాకా అమ్ముతున్నాడు.

ఆ తర్వాత మరో రోజు గతంలో వచ్చిన వ్యాపారి రావటంతో మొత్తానికి బేరమాడి, కిలో 130 చొప్పున అతనికి అమ్మటం జరిగింది. అప్పటికి చెట్లు కూడా పెద్దవి కావటంతో ఒక్కో చెట్టుకు సరాసరిన 50 కిలోల దిగుబడి వచ్చింది. వాటిని అమ్మగా ఆ సంవత్సరం 70 లక్షలకు పైగా ఆదాయం లభించింది.

కుంకుడు కాయలపై అధిక ఆదాయం రావటంతో వీటిని కేవలం తల స్నానం చేయటానికి శాంపూలాగా వాడటమేనా ఇంకేమైనా చెయ్యవచ్చా అని తానే కొన్ని ప్రయోగాలు చేశాడు. ఒక కుంకుడు కాయను రాత్రి నీటిలో నానబెట్టినట్లయితే, ఉదయంకల్లా అది మెత్తగా అవుతుంది. ఆ పండు గుజ్జు తీసుకుని పళ్ళు తోముకున్నట్లయితే ఎటువంటి గార పట్టిన పళ్ళయినా సరే తెల్లగా మారిపోతాయి. కుంకుడు కాయలను నానబెట్టిన తర్వాత వాటి గుజ్జును తీసి మెత్తగా రుబ్బి నీటిలో కలిపి ఇంట్లో వంట పాత్రలు తోమినట్లయితే అవి మిలమిలా మెరుస్తాయి. నేలపైన బండలను ఈ కుంకుడు కలిపిన నీటితో తుడిచినట్లయితే బండలు శుభ్రంగా ఉండటంతో పాటు, పాదాలకు ఎటువంటి హాని ఉండదు. మార్కెట్‌లో లభించి ప్రతి ఫ్లోర్ క్లీనర్‌లో యాసిడ్ కలిసి ఉంటుంది కాబట్టి వాటిపై తిరుగాడే మన కాళ్ళు వగుళ్ళకు గురౌతాయి. అదే ఈ కుంకుడు రసంతో బండలు తుడిచినట్లయితే శుభ్రంగా ఉండటంతో పాటు, పాదాలకు ఎటువంటి హాని ఉండదు. (ఈ విషయాలను వారు చెప్పారు కానీ, ఉపయోగించే వారు నిపుణుల సలహాతో ఉపయోగించుకోగలరు). ఈ కుంకుడు కాయల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి కాబట్టి వీటి ఖరీదు ఎప్పటికీ తగ్గదు అని అర్థమైంది పద్మారెడ్డికి.

ఇదేదో బావుందని తనవద్ద వున్న చెట్లలో బాగా దిగుబడి వచ్చే వాటిలో కొన్నింటి విత్తనాలను ప్రత్యేకంగా సేకరించి, శుభ్రం చేసి అడిగిన రైతులకు విత్తనం కొరకు కిలో 1000 రూపాయల చొప్పున విక్రయిస్తున్నాడు పద్మారెడ్డి.

ఇలా ఒక్కసారి నాటి, కేవలం మూడు నాలుగు సంవత్సరాలు వాటిని కాపాడుకుంటే రైతుకు ఊహించని ఆదాయం వస్తుంది. పెద్ద




కమతాలున్న, వ్యవసాయం చేసుకోలేక బీడు భూములుగా మారుస్తున్న రైతులు ఈ పద్ధతిని ఉపయోగించుకుని, అధిక ఆదాయం పొందాలని కోరుకుంటున్నాడు పద్మారెడ్డి. ఏ పండ్ల తోట వేసినా వాటిని సంరక్షించ టానికి అయ్యే ఖర్చు తడిసి మోపెడు అవుతుంది కాబట్టి కుంకుడు చెట్లు నాటడం వల్ల ఒక్కసారి పెట్టుబడి పెడితే తమ జీవిత కాలం పాటు ఆదాయం పొందవచ్చు అంటున్నాడు పద్మారెడ్డి.

పద్మారెడ్డి తన పొలంలో కుంకుడు చెట్లతో పాటు జామ, నారింజ, బొప్పాయి, సీతాఫలం, మామిడి లతో పాటు ఇంకా ఎన్నో రకాల పండ్ల చెట్లను నాటాడు. వీటన్నిటికి నీరు పారించే పద్ధతితోనే ఒక సృజనాత్మకతను ఏర్పాటు చేసుకున్నాడు. వీరికి తన తోటలోనే ఆవులను పెంచుతున్నాడు. వీరి గోశాల ఎంతో శుభ్రంగా కనిపించింది. గోశాల ఇంత శుభ్రంగా ఉండటం ఏమిటని అడుగగా, మేము పేడను చేతితో తీసివేయాల్సిన అవసరం లేకుండా పైపు ద్వారా నీటితో శుభ్రం చేస్తామ ని, అలా శుభ్రం చేసిన నీళ్ళు, గో మూత్రంతో పాటు ఈ నీరంతా చేరటా నికి ఒక పెద్ద తొట్టి ఏర్పాటు చేసిన తొట్టిలోకి వెళుతుంది. ఆ తొట్టి నిండి న వెంటనే పక్కనే వున్న మరో తొట్టిలోకి గోశాల శుభ్రం చేసిన నీరు వెళు తుంది. ప్రతి పది, పదిహేను రోజులకు ఒకసారి ఈ నీటిని పంట పొలా లకు అందిస్తుంటారు. ఇలా గో మయంతోపాటు, మూత్రం కూడా కలిసిన నీరు వీరి పండ్ల తోటకు వెళ్ళటం వల్ల పద్మారెడ్డి అదనంగా తమ చెట్లకు పురుగు మందు లేదా సేంద్రియ పురుగు మందులను పిచికారి చేయాల్సిన పని కూడా చాలా తక్కువ. ఎందుకంటే చెట్లకు నేరుగా పుష్టి కరమైన గోమయం, గోమూత్రంతో కూడిన నీరు వెళ్తుంది కాబట్టి వీరి చెట్లకు ఎటువంటి చీడ పీడలు ఆవహించడం లేదు. సంవత్సరం మీద ఒకటి రెండు సార్లు మాత్రమే పంచగవ్య, ఇతర సేంద్రియ పురుగు మందులను పిచికారి చేస్తామే తప్ప, అదేపనిగా పురుగు మందు పిచికారి చేయాల్సిన అవసరం మాకు ఇంతవరకు ఏర్పడలేదు అన్నాడు పద్మా రెడ్డి. వాటిని పిచికారి చేసేందుకు కూడా మనుషులు స్ప్రేయర్లను మోసు కు వెళ్ళ వలసిన అవసరం లేకుండా తోపుడు బండిపైన ఒక నీటి డ్రమ్ము, మందు నీటిని తోడేందుకు స్ప్రేయర్ యంత్రాలతో తానే ఒక స్ప్రేయర్ తయారు చేయించుకోవటం వల్ల ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు తన తోట మొత్తాన్ని రెండు మూడు రోజుల్లోనే పిచికారి చేస్తారని అన్నాడు.

స్వచ్ఛమైన గోమయం, గోమూత్రంలో చెట్లు పెరుగుతున్నాయి కాబట్టి పద్మారెడ్డి తోట ఎంతో ఆకర్షణీయమైన రంగుతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. అన్ని రకాల పండ్లు కూడా ప్రత్యేకమైన రుచిని సంతరించు కుంటున్నాయి. పెద్దయెత్తున తోట కాబట్టి వీరు మార్కెట్‌కు వెళ్ళాల్సిన అవసరం లేకుండా వ్యాపారులే నేరుగా తోట వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేసి తీసుకు వెళ్తుంటారు. మొత్తానికి తక్కువ ఖర్చు, శ్రమతో, అనవసరమైన కూలీల అవసరం లేకుండా, ఆరోగ్యకరమైన పండ్లను సమాజానికి అందిస్తున్న పద్మారెడ్డి తోట ఎంతో చూడముచ్చట గా ఉంటుంది.





ప్రకృతిలో అద్వితీయమైన శక్తి దాగుంది. దాన్ని అర్థం చేసుకుని వ్యవసాయం చేస్తే ప్రతి రైతు లాభాల బాట పట్టవచ్చు అని నిరూపించాడు పద్మారెడ్డి. ఈయన నాటిన కుంకుడు చెట్లకు తానేమీ చేయకపోయినా, ప్రకృతి తనకు ఆదాయాన్ని సమకూరుస్తుంది అన్న నిజం తెలుసుకున్నాడు కాబట్టే ప్రకృతిమాత ఆశీస్సులతో నేడు లాభాల బాట పట్టాడు. అంటే ఇక్కడ పెట్టుబడి (ఇన్‌పుట్) నామమాత్రం కానీ, లాభం (అవుట్‌పుట్) మాత్రం ఊహాతీతంగా వస్తోంది. సరైన మార్గంలో వెళ్తే భూమాత తన బిడ్డలను (రైతులను) ఆశీర్వదిస్తూనే ఉంటుంది. ఇది ప్రకృతి మనకు ఇచ్చిన మహాప్రసాదం అంటాడు పద్మారెడ్డి. ఈ విషయాన్ని అవగాహన చేసుకుంటే ప్రతి రైతు సంతోషంగా ఉంటాడు. ఇక్కడ ఈ రైతు కనుగొన్న సత్యం వ్యవసాయం నిత్యం చేయాల్సిన అవసరం లేకున్నా సరే, ఆదాయాన్ని ఇచ్చే పంటలు కొన్ని ఉన్నాయి అని నిరూపించాడు. అలా చేస్తూనే ఉన్నాడు. ఈయన తన పొలాన్ని ప్రతి సంవత్సరం దున్నాల్సిన అవసరం లేదు, నీరు పెట్టాల్సిన పని లేదు, ఎరువులు వేయాల్సిన పని లేదు, పురుగు మందు కొట్టాల్సిన పని లేదు కానీ ఆదాయం మాత్రం తప్పకుండా వస్తుంది. దీన్నే 'వ్యవసాయం చేయాల్సిన అవసరం లేని పంట' (అన్ కల్టివేటెడ్ క్రాప్) అంటే "కష్టం లేని పంట'' ఈ కుంకుడు చెట్ల పెంపకం. అందుకే 'పల్లెసృజన' అంటోంది "గ్రామాలను భగవంతుడు సృష్టిస్తే, పట్టణాలను మనుషులు నిర్మించారు". చాలా మంది అర్థం చేసుకోలేని విషయం ఒకటుంది. అదేమిటంటే చాలా మంది పట్టణాల్లో తాము ఉద్యోగాలు చేసి, ట్యాక్సులు కట్టి రైతులకు సబ్సిడీ ఇస్తున్నాము అనుకుంటుంటారు. కానీ, వాస్తవమేమిటంటే, మనం రైతులకు సబ్సిడీ ఇవ్వటం లేదు, రైతులే మనకు సబ్సిడీగా ఆహారాన్ని అందిస్తున్నారు. వాళ్ళు ఇచ్చే ఖరీదుకు మనకు ఏ ఆహారం మార్కెట్లో లభించదు. అంటే ఎవరు ఎవరివద్ద భిక్ష తీసుకుంటున్నామో అర్థం చేసుకుంటే చాలు రైతు పట్ల అభివృద్ధి చెందిన సమాజం ఆలోచనే మారిపోతుంది.

చేపలు పిల్లలు పెడతాయి, కోళ్ళు గుడ్లు పెడతాయి, పిల్లల్ని పొదుగుతాయి. వీటికేమైనా మనం పెట్టుబడి పెడుతున్నామా? ఊర్లో చెరువులు, నదులు పాడు కాకుండా చూసుకుంటే చాలు చేపలు పెరుగుతాయి. కోళ్ళు కొన్ని పెంచి వదిలితే చాలు అవే ఆరుబయలుకు వెళ్ళి తిని వస్తాయి, మీ ఇంట్లో గుడ్లు పెట్టి పొదుగుతాయి. వీటికేమీ మనం కష్టపడి, పెట్టుబడి పెట్టి పోషించడం లేదే. ఇటువంటివి ఇంకా ఎన్నో దాగున్నాయి ప్రకృతిలో. వాటిని కనుగొని మనం ఆచరిస్తే చాలు. వాటిని కనుగొని మీరూ పండించండి అంతేగాని 'ఈ సేద్యాలు మేము చెయ్యలేము' అని పొలాల ను బీడు భూములుగా మార్చకండి అని చెప్పి పెద్ద కమతాలున్న రైతులకు ఒక మార్గదర్శకుడిగా మారిన పద్మారెడ్డిని అభినందిస్తోంది 'పల్లెసృజన'.

**సృజనాత్మక రైతు పద్మారెడ్డి ఫోన్ నెం. 9948 111 931.**

Honey Bee Network

# gian



## Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్

## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు

## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

**ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !**

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.



ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.

**చివరి తేది 31 ఆగస్టు, 2023**

last date



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

## అభివృద్ధి చేయబడ్డ 'సుర్జీత్ బాస్మతి' వరి విత్తనం



హార్యానా రాష్ట్రం లోని కర్నాల్ ప్రాంతంలో గల 62 సం.ల సుర్జీత్ సింగ్ ఒక అభ్యుదయ రైతు. ఈయన ఎంపిక పద్ధతిపై పొడవైన గింజలు కలిగిన, ఉప్పు నీటికి కూడా తట్టుకొనే 'బాస్మతి బియ్యం' రకాన్ని రూపొందించాడు.

సుర్జీత్ సింగ్ నివసించే కర్నాల్ ప్రాంతం సువాసన కలిగిన బాస్మతి బియ్యం సేద్యానికి పేరెన్నిక గలిగింది. 18 ఎకరాల మంచి నీటి వసతి వున్న భూమి కలిగిన ఈయన గత 40 సంవత్సరాల నుండి వ్యవ సాయం చేస్తున్నాడు. డిగ్రీ పూర్తి చేయకుండానే చదువు ఆపేసిన ఈయన కొత్త పద్ధతులను ఆచరించి వ్యవసాయం చేసే రైతుగా పేరు గాంచాడు. ఈయన చేసే వ్యవసాయంలో భార్య, ఇద్దరు కొడుకులు కూడా ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటారు. వీరికి ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలతో పాటు పశు సంపద కూడా ఉంది. తమ ఇంటి వెనకనే వున్న ఒక నీటి కుంటను కౌలుకు తీసుకొని చేపల పెంపకం కూడా చేశాడు. వీరి ఇంట్లో బయో గ్యాస్ ప్లాంటు కూడా ఉంది ఆ గ్యాస్‌ను వారికి కావలసిన వంటకు ఉపయోగిస్తుంటారు.

ఈయన తన పొలంలో గోధుమ, ధాన్యము, బఠాణీ, ఆవాలు, ఆలుగడ్డ, శనగలు, మిరప, టమోట మొదలైన పంటలు పండిస్తారు. 2008లో ఈయన తన పొలంలో 'పూస-1460' రకం వరి పంట వేశాడు. కానీ చీడ పట్టి పంట మొత్తం నాశనమైంది. కేవలం ఒకే ఒక్క మొక్క మిగిలింది. ఆ మొక్క నుండి వచ్చిన విత్తనాలని 2009లో తిరగి నాటాడు. ఆ పంట కోతకు వచ్చే సమయంలో ఆరోగ్యకరంగా కనిపించిన 225 మొక్కల విత్తనాలను సేకరించి, వాటిని పొలం నాటాడు. ఈ విధంగా 2-3 సంవత్సరాలు చేసిన తర్వాత తాను సంతృప్తి పడ్డ పొడవు, రంగు, రుచి, వాసన కలిగిన రకాన్ని స్థిరపరిచాడు. దీనికి "సుర్జీత్ బాస్మతి-1" అని పేరు పెట్టుకున్నాడు. ఈ రకాన్ని కర్నాల్ ప్రాంతంలో పదిమంది రైతులకి ఇచ్చి ప్రయోగాత్మకంగా పంట వేయమని చెప్పాడు. వారు ఈ రకం తక్కువ పోషకాలు వున్న భూమిలోను, ఉప్పునీరు వున్న ప్రాంతాల్లో కూడా చక్కగా పండి, ఎక్కువ దిగుబడి వచ్చిందని చెప్పారు.

ఈ రకం వరి 125-135 రోజుల్లో కోతకు వస్తుంది. హెక్టారుకు 55-60 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. వడ్ల నుంచి బియ్యం కూడా 67 శాతం వరకు వస్తుంది. గింజ కూడా 11.16 మి.మీ. పొడవు కలిగి వుంటుంది. ఇది సాధారణం కన్నా చాలా ఎక్కువ. అనేక చీడ పీడలను తట్టుకోవటమే కాక, ఏ రకమైన నేలల్లో అయినా పంట బాగా వస్తుంది. ఈ వడ్లను నీటిలో 24 గంటల పాటు నానబెట్టి, సిమెంటు అరుగుపై గింజలు పరిచి, తడి గోనె సంచులతో కప్పి అప్పుడప్పుడూ నీటితో తడుపుతూ ఉంటే ఇవి మొలకెత్తుతాయి. మొలకెత్తిన వీటిని నేరుగా పొలంలో విత్తుకోవచ్చు లేదా నర్సరీ బెడ్లపైన విత్తుకొని యంత్రంతో నాటుకోవచ్చు. 35 నుండి 40 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకుని ఈ వరి పండుతుంది. జూన్-జులై మాసాల్లో నాటినట్లయితే, అక్టోబర్ - నవంబర్ నెలల్లో కోతకు వస్తుంది. దీనికున్న మంచి లక్షణాల



కారణంగా మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

కర్నాల్ ప్రాంతం లోని 'సెంటర్ సాయిల్ శాలినిటీ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎస్ఎస్ఆర్ఐ)' వారు దీనిపై పరిశోధనలు చేసి, ఉత్తమమైన రకంగా నిర్ధారించారు. హర్యానా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు హిస్సార్ మరియు హర్యానా కెవికె వారు కూడా దీని లక్షణాలను నిర్ధారించారు. పిపివి&ఎఫ్ఆర్, న్యూ ఢిల్లీ వారి వద్ద ఈ రకాన్ని రిజిష్టరు చేయటానికి దరఖాస్తు చేయడం జరిగింది.

2017లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 8వ ఇన్నోవేషన్ ఫెస్టివల్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ స్థాయిలో 2వ బహుమతితో సత్కరించడం జరిగింది.

**భారత రాష్ట్రపతిచే 'జీవన సాఫల్య పురస్కారం' పొందిన**

## అభివృద్ధి చేయబడ్డ 'కుద్రత్' వరి విత్తనం

ఉత్తర ప్రదేశ్ లోని వారణాసి కి చెందిన 60 సంవత్సరాల 'ప్రకాశ్ సింగ్ రఘువంశీ' తనకున్న 3 ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ గోధుమ, వరి, కంది పంటలు పండిస్తూ ఉంటాడు. వీళ్ళ గ్రామంలో అభివృద్ధి చేసిన రకాలు లేక హైబ్రీడ్ విత్తనాల మీదే ఆధార పడవలసి వచ్చేది. 1995లో ఈయన తాను వేసే పంటలైన గోధుమ, వరి, కంది విత్తనాలను అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ప్రారంభ దశలో మంచి ఫలితాలు రాకపోయినా నిరుత్సాహ పడకుండా తన ప్రయత్నాలు కొనసాగించాడు.



దీనికై బ్యాంకు నుండి, స్నేహితుల నుండి అప్పులు చేయవలసి వచ్చేది. తన ప్రయోగాలలో భాగంగా 'బీజ్ దాన్ మహా దాన్' (విత్తన దానమే గొప్ప దానము) ఉద్యమాన్ని ప్రారంభించి, స్థానికంగా ఉత్పత్తి చేసిన విత్తనాలని ఉచితంగా రైతులు మార్పిడి చేసుకునే విధానాన్ని ప్రారంభించాడు. ఈయన ప్రయోగాలన్నీ 'కుద్రత్–5' పేరున అభివృద్ధి చేసిన వరి రకంతో ఫలించాయి.

ఇదేవిధంగా ఈయన తాను పండించే ఇతర పంటలైన కంది, ఆవాలు, గోధుమలలో కూడా అభివృద్ధి చెందిన రకాలను అనేక చీడ పీడలను తట్టుకునే విధంగా మంచి వాసన, రంగు, రుచి కలిగి ఉండేలా రూపొందించాడు. ఇవన్నీ తాను కొన్ని లక్షణాలు అనుకొని, అవి సాధించేంత వరకు ఎంపిక పద్ధతిలో ప్రయోగాలు చేసి, చివరికి ఫలితం సాధించాడు. ఈయన వద్ద ప్రస్తుతం 100 వరి రకాలతో పాటు, ఎన్నో రకాల గోధుమ, ఆవాలు, కంది, పెసర, ఆనప(సొర)కాయ మొదలైన విత్తనాలు సేకరించి, తయారు చేసి అందజేయ గలుగుతున్నాడు. ఈయనను 2007లో ఎన్ఐఎఫ్ వారు సత్కరించగా, పిపివి&ఎఫ్ఆర్ఎ వారు 2010–11కు గాను ప్లాంట్ జినోమ్ సేవియర్ రికగ్నిషన్ పురస్కారంతో సత్కరించారు. ఇదే కాక, ఈయనను ఎన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పుర్కారాలు వరించాయి.

ఈయన తన మూడు 'కుద్రత్' విత్తనాల రకాలను 'ఆరతి సీడ్స్ & రీసర్చ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ద్వారా ఉత్పత్తి, అమ్మకాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో చేస్తున్నారు. ఈయన రూపొందించిన వరి రకాలు 'కుద్రత్–1', 'కుద్రత్–5', కంది



రకమైన 'కుద్రత్–3', గోధుమ రకాలైన 'కుద్రత్–9', 'కుద్రత్–17', ఆవాలలో 'కుద్రత్–గీత' మొదలైన వాటిని ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఝార్ఖండ్ మొదలైన 15 రాష్ట్రాలలో వితరణ చేస్తున్నాడు. ఇంత వరకు దేశంలో లక్షకు పైగా రైతులు ఈయన అభివృద్ధి చేసిన విత్తనాల ద్వారా లాభాలను ఆర్జిస్తున్నారు.

ప్రకాశ్ సింగ్ రఘువంశీ భారత దేశ రైతుల కోసం చేసిన కృషిని అభినందిస్తూ 2019లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 10వ ఇన్నోవేషన్ ఫెస్టివల్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా 'జీవిత సాఫల్య పురస్కారం'తో సత్కరించడం జరిగింది.

**విత్తనాల కొరకు సంప్రదించండి : సుభాష్, ఫోన్ 9652801700**

### పల్లెసృజన కుటుంబానికి శుభవార్త !

ఈమధ్యనే 'యోజక్' ఆధ్వర్యంలో సి–20 లైఫ్ సదస్సులు హైదరాబాద్ లో 'పల్లెసృజన' దిగ్విజయంగా నిర్వహించిన సంగతి మీ అందరికీ తెలుసు. దానితో ప్రపంచం లోని చాలా ప్రాంతాల వారికి 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాల గురించి ఒక అవగాహన ఏర్పడింది. ఇప్పుడు అదే 'యోజక్' సహాయంతో 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలు ఒక ఉద్యమ స్ఫూర్తితో దేశ నలుదిశలా వ్యాపింప జేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన తీరు తెన్నులు సూచించటానికి జులై 16–17వ తేదీలలో నందుర్‌బార్ (మహారాష్ట్ర) పట్టణంలో 'పల్లెసృజన' మరియు 'యోజక్' సంస్థల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇది పల్లెసృజన కుటుంబానికి ఒక ఆనందకరమైన మలుపు. **-ఎడిటర్**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

### దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని **(ఫోన్ : 040-40253096)** సంప్రదించండి.




గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.


## 'బల్క్ రోటీ మేకర్'తో గ్రామీణ యువతకు ఉపాధి

మారుతున్న ఆరోగ్య పరిస్థితులు, తృణ ధాన్యాలు, జొన్న రొట్టెల వినియోగం పట్ల అవగాహన పెంచుకుంటున్న వ్యక్తుల సంఖ్య నానాటికీ పెరిగి పోతోంది. పూర్వం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు ప్రతి ఇంట్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో జొన్న రొట్టెలు విధిగా చేసుకుని తినేవారు. ఇప్పుడు చాలా మంది మహిళలకు జొన్న రొట్టెలు తయారు చేయటమే రావటం లేదు. ప్రత్యామ్నాయంగా పూరీలు, చపాతీలు, ఇడ్లీ, దోశ లాంటివి అల్పాహారంగా మారాయి. అందుకే పూర్వీకులు ఎంతో శరీర దారుఢ్యంతో ఉండగా, నేటి యువత నిర్వీర్యంగా మారి, ఏమాత్రం శ్రమకు ఓర్వలేక చిన్న చిన్న పనులకే అలసట పొందుతున్నారన్నది వాస్తవం.

నాటి పరిస్థితులను అవగాహన చేసుకోవటం, తృణ ధాన్యాల ఆహారం వలన కలిగే లాభాలను వివరించే స్వచ్ఛంద సేవకులు చెప్పే కథనాలు, ప్రయోగాత్మక వివరాలను ఆకళింపు చేసుకున్న నేటి సమాజం లోని వ్యక్తులు జొన్న రొట్టెలపట్ల మక్కువ పెంచుకుంటున్నారు. వాటి రుచిని ఆస్వాదించిన వ్యక్తులు ఎక్కువగా జొన్న రొట్టెల ఆహారం తీసుకోవటం ఆహ్వానించదగ్గ విషయం. గత దశాబ్ద కాలంలో జొన్న రొట్టె తినేవారు అంటేనే చిన్న చూపు చూసిన వ్యక్తులు ఇప్పుడు వాటిని ఎక్కువ ఖరీదైనా సరే తాము కొని తెచ్చుకొని తింటున్నారు. అందుకే ఇప్పుడు నగరాలు, పట్టణాల్లోని దాదాపు ప్రతి వీధిలో సాయంకాలం పూట రొట్టెలు చేసి విక్రయిస్తూ ఎంతోమంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. రహదారుల ప్రక్కన వున్న దాబాలతో పాటు, స్టార్ హొటళ్ళకు కూడా ఈ రొట్టెల సంస్కృతి పెరిగి పోయింది. జొన్న రొట్టెల







తర్వాత ఆ స్థానాన్ని ఆక్రమిస్తోంది 'గోధుమ రొట్టె', 'చపాతి', 'నాన్ రోటీ' లు అన్న విషయం చాలా మందికి తెలుసు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో రొట్టెలు చేసే నైపుణ్యం గల వ్యక్తులు లభించటం కూడా తక్కువ కావటం వల్ల కొంత మంది హోటల్ యజమానులు గిరాకి ఉన్నా, రొట్టెలు అందించలేక నష్ట పోతున్న విషయం కూడా నిజమే.

ఈ సమస్య పరిష్కారం కోసం 'పల్లెసృజన' ఇన్నోవేటర్ ఎ.జె. రావు తాయారు చేసిన 'బల్క్ రోటీ మేకర్' ఈ సమస్య నివారణకు మార్గం చూపింది. ఇతను తయారు చేసిన రోటీ మేకర్‌ను ఇప్పుడు చాలా సంస్థలు తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేశాయి.

ఈ రోటీ మేకర్ తో తయారు చేసిన చపాతి, జొన్నరొట్టెలు అలాగే ప్యాక్ చెయ్యటం వల్ల అవి బూజు పట్టే ప్రమాదం ఉందని ఇప్పుడు రోటీ మేకర్ లోనే కొంత వరకు అవి వేడి అయ్యేలా చెయ్యటం వల్ల కొన్ని రోజుల పాటు అవి చెడిపోకుండా ఉండేలా కూడా యంత్రాన్ని అభివృద్ధి చేశాడు ఎ.జె. రావు. ఈ యంత్రాన్ని కొనుగోలు చెసుకుని తమ ఇంట్లోనే జొన్న రొట్టెలు, చపాతీలు తయారు చేసి, మీ ప్రాంతాల్లో ఉన్న హోటళ్ళు, దాబాలు మరియు గృహస్తులకు విక్రయించటం ద్వారా గ్రామీణ యువత ఇంట్లోనే ఉండి స్వయం ఉపాధి పొందవచ్చు. ఇలా చేయటం వల్ల హోటల్ యజమానులకు కూడా రొట్టెల తయారీకి ప్రత్యేకమైన నైపుణ్యం గల వ్యక్తులను నియమించుకోవాల్సిన పని లేకుండా వీటి ద్వారా లాభం పొందటంతో పాటు, వినియోగ దారులకు అవసరమైన రొట్టెలను అందించటంతో వారి వ్యాపారం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

కర్నాటక రాష్ట్రంలోని 'రాయచూరు' ప్రాంతం జొన్న రొట్టెలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతం రొట్టెలు చాలా పలుచగా, రుచిగా ఉండి నోట్లో వేసుకుంటే 'కరుం కురుం' అని లొట్టలు వేసుకుంటూ తింటుంటారు. వీటి ప్రత్యేకత ఏమిటంటే వాటిని ఎన్ని రోజులు నిలువ ఉంచుకున్నా అవి చెడిపోయే ప్రమాదం లేదు. అందుకే పదుల సంఖ్యలో వీటిని కొనుగోలు చేసుకుని ఇంట్లో ఉంచుకుని రోజూ తింటూ ఉంటారు కొందరు. వీటి 'కడక్ రొట్టెలు' అని పిలుస్తారు. ఇవి ఎంతగా ప్రాచుర్యం పొందాయి అంటే ఈ రొట్టెలను విదేశాలకు ఎగుమతి కూడా చేస్తున్నారు అంటే చాలా మంది నమ్మటం కష్టం. కానీ ఇది నిజం. కొందరు గృహిణులు ఈ కడక్ రొట్టెలను ఎగుమతి కూడా చేసి లాభాలను ఆర్జిస్తున్నారు.

ఎజె రావు తయారు చేసిన రోటీ మేకర్ తో ఈ కడక్ రొట్టెలను కూడా తయారు చేయవచ్చు. ఇతను తయారు చేసిన రోటీ మేకర్లు గృహ అవసరాల కోసం చిన్న యంత్రంతో పాటు, ఎక్కువ మొత్తంలో రొట్టెలు తయారు చేసి హోటళ్ళకు విక్రయించాలి అనుకునే వారి కోసం 'బల్క్ రోటీ మేకర్' అంటే ఎక్కువ మొత్తంలో రొట్టెలు తయారు చేసే యంత్రాన్ని కూడా రూపొందించాడు. ఈ రొట్టెలు కూడా 11 అంగుళాల వెడల్పు ఉండి, వినియోగదారులకు బాగా ఆకట్టుకుంటాయి. అలాగని అంతే వెడల్పులో రొట్టెలను తయారు చేసుకోవాల్సిన అవసరం లేదు. మీరు ఎంత వెడల్పులో చేసుకుంటే మీకు లాభదాయకంగా, వినియోగ దారుకి ఆకర్షణీయంగా ఉంటాయన్నది గ్రహించి మీకు అవసరమైన సైజులో రొట్టెలను తయారు చేసుకోవచ్చు.

ఎక్కువ మొత్తంలో రొట్టెలు తయారు చేసే వారు రొట్టెకు అవసరమైనంత పిండి ముద్దను చేతితో తయారు చేస్తే పరిమాణంలో హెచ్చు తగ్గులు ఉండే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కారం కొరకు పిండిని తడిపి, సమాన పరిమాణంలో ముద్దలను కత్తిరించే యంత్రాన్ని కూడా తయారు చేశాడు.





కావున గ్రామీణ యువతీ యువకులకు ఈ వ్యాపారం వల్ల ఎంతో లాభదాయకంగా ఉండటంతో పాటు, అంతరించి పోతున్న జొన్న పంటను అభివృద్ధి చేసి, రైతాంగానికి తోడ్పాటు అందించిన వారు అవుతారు. జొన్న పంట చాలా సులభమైనది, ఎటువంటి పురుగు మందులు, ఎక్కువగా ఎరువులు వేయాల్సిన అవసరం లేకుండా పండే పంట, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చే పంట మాత్రమే కాదు, పశువులకు మంచి మేతను కూడా అందించే పంట. అంతే కాదు, ఈ జొన్న పంట వేయటం వల్ల కనుమరుగై పోతున్న పక్షులు, పిట్టల సంఖ్య కూడా పెరగటం వల్ల మిగతా పంటలను ఆశించే పురుగులను ఈ పిట్టలు తిని రైతాంగానికి రసాయనిక పురుగు మందులు పిచికారి చేసే ఖర్చును కూడా చాలా వరకు తగ్గిస్తాయి.

అంటే యువత ఈ రోటీ మేకర్లను ఉపయోగించి మీ గ్రామంలోనే, మీ ఇంట్లోనే ఉంటూ ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఉపాధి పొందటమే కాదు, రైతాంగానికి, పర్యావరణానికి సహాయం చెయ్యటంతో పాటు సమాజాన్ని కొంత వరకు ఆరోగ్యాన్ని కూడా ప్రసాదించిన వారవుతారు. కాబట్టి యువత ఈ రోటీ మేకర్లను వినియోగించుకొని ఉపాధి పొందాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'.

**రోటీ మేకర్ కొరకు సంప్రదించండి : ఎ.జె. రావు, 9440092569.**

# ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలి అన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 400/–లతో 2సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని 30 వేల గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని, సామాన్య ప్రజల మధ్య సమానాంతర సంభాషణలు ప్రారంభమై, వారిని మరింత ప్రభావితం చేస్తాయని 'పల్లెసృజన' మనసారా ఆశిస్తోంది. - ఎడిటర్

## పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరిచండి!




### మీ గ్రామానికి మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'

సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా, అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే?

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది. చందా వివరాలు ఈ పత్రిక ఆఖరు కవరు పేజీలో చూడండి.

# జులై-ఆగస్టు 2023లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు



11 జులై 2023న మల్లారెడ్డి స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ కు చెందిన ప్రధాన ఆచార్యులు మరియు అధ్యాపకులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లు ఫలవంతంగా సమాజానికి అందటానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇవ్వటం జరిగింది.





జులై 25న టిఎన్ఐసి బృందం 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల విస్తరణ కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు, ఇన్నోవేషన్లను గురించి వారికి వివరిస్తున్న దృశ్యం.



'గూంజ్' అనే జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించి, సమాజంలో పునాది స్థాయి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి, సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న 'పల్లెసృజన'ను అభినందిస్తూ జ్ఞాపికను బహూకరించిన దృశ్యం.





జూన్ 9న హైదరాబాద్ లోని 'హితం ఇంజనీరింగ్ కళాశాల'లో జరిగిన ఒక కార్యక్రమంలో "సమాజంలో ఉన్న సమస్యలను విద్యార్థులు ఎలా పరిష్కరించాలి" అన్న విషయంపై 'పల్లెసృజన' ప్రతినిధి సుభాష్ పాల్గొన్న దృశ్యం.




16 జులై, 2023న 'పల్లెసృజన' బృందం మహారాష్ట్ర లోని కెవికె, నందమబార్ ను వారి ఆహ్వానం మేరకు సందర్శించి, వస్తున్న పునాది స్థాయి ఇన్నోవేషన్లు సమాజంలో తీసుకు రాగలిగే మార్పును గురించి చర్చించడం జరిగింది.





4 ఆగస్టు, 2023న తెలంగాణ రాష్ట్రం లోని సిరిసిల్ల జిల్లా, బొప్పాపూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులకు ఇన్నోవేషన్‌ల మీద అవగాహన సదస్సు నిర్వహించి, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్‌ల మీద అవగాహన కల్పించడం జరిగింది.





10 జులై, 2023న 'ఓరియంటేషన్ ఆఫ్ ఇన్‌స్పైర్' కార్యక్రమంలో 600 మందికి పైగా ఉపాధ్యాయులను ఉద్దేశించి సుభాష్ ప్రసంగించటం జరిగింది.





15 ఆగస్టు, 2023న తెలంగాణ రాష్ట్రం లోని రంగారెడ్డి జిల్లా, రావులపల్లి గ్రామంలో సిబిఐటి ఆధ్వర్యంలో ఒకరోజు రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఏడుగురు ఇన్నోవేటర్లు, 25 ఇన్నోవేషన్లను ప్రదర్శించారు.

# 'పల్లెసృజన' ఆధ్వర్యంలో జరిగిన 45వ 'చిన్న శోధయాత్ర' పై యాత్రీకుల అభిప్రాయాలు



- జమ్మలమడక శశిమోహన్

మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాలను (గ్రామాలను) దర్శిస్తూ జ్ఞానాన్వేషణ చేయడం, ప్రకృతితో సమన్వయంగా సహజీవనం చేస్తూ ప్రకృతినుంచి జ్ఞానాన్ని పొందే గ్రామీణులను కలవాలన్నదే 'శోధయాత్ర' ప్రధాన ఉద్దేశ్యం. ఇలాంటి శోధయాత్రలను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.) సంవత్సరానికి నాలుగు సార్లు దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తుంది. అదే కోవలో 2011 నుండి 'పల్లెసృజన' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చేసే 3 రోజుల యాత్రను 'చిన్న శోధయాత్ర' గా పరిగణిస్తున్నాము.

'పల్లెసృజన' ఆధ్వర్యంలో నిరంతరంగా జరుగుతున్న 'ఈ చిన్న శోధయాత్ర'ల్లో భాగంగా 45వ చిన్న శోధయాత్ర 23–25 జూన్, 2023 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా కోంద్రముట్ల గ్రామం నుండి మేళ్ళవాగు గ్రామం వరకు దాదాపు 50 కి.మీ మేర కొనసాగిన ఈ యాత్రలో విద్యార్థులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సేవకులు, వృత్తి నిర్వాహకులు తదితరులు దాదాపు 50 మంది పాల్గొన్న వారిలో యాత్రను గురించి కొందరి అభిప్రాయాలను ఇక్కడ పొందు పరుస్తున్నాము.

**హరీష్:**

పల్లెసృజన అనే తోటలో శోధయాత్ర అనే చెట్టుపై నాకు కనిపించిన, అనిపించిన మరియు నేను రచించిన కొన్ని పదాలు.

- అడవి తల్లి ఒంటిపై చెత్తను శుభ్రం చేయటానికే తన జీవితాన్ని అర్పించిన నిజమైన హీరో 'కామెర జాజి' గారిని కలవడం మా అదృష్టం.
- భర్తను కోల్పోయినా, బాధ్యతలను మరియు ఆశయాలను వీడని అమ్మ కనిపించింది.
- భావాలకు భాషతో సంబంధం లేదని నిరూపించిన కొంత మంది యాత్రీకుల్లో నిజమైన తృష్ణ కనిపించింది.
- ఒంటిమీద వున్న చిన్న గాయం ముందు కంటి ముందున్న గమ్యం ముఖ్యమని కాళ్ళ నొప్పులను కూడా లెక్క చెయ్యకుండా నడక కొనసాగించిన ఓ చెల్లెమ్మ కనిపించింది.
- చంచలమైన మనస్సుతో వయసులో వున్న ఆత్మ శోధనకై సందేహాలని నివృత్తి చేసుకోవాలి అన్న జిజ్ఞాస ఉన్న యువత కనిపించింది.
- తల పండిన అనుభవంతో తాపీగా ఇంట్లో ఉండిపోక, వృద్ధాప్యంలోనూ తపనతో యాత్రలో పాల్గొనాలని తపించిపోతున్న తపోధనులు కనిపించారు.
- యాత్రలో నడవటంతో పాటు యాత్రను నడిపించటమూ మా వంతే అంటూ యాత్రీకులుగా స్వచ్ఛంద సేవకులుగా శోధయాత్ర రంగస్థలం పై ద్విపాత్రాభినయం చేసిన సమయస్ఫూర్తిగల మిత్రులు కలిశారు.

**అమిత్ టిల్లు:**

కొన్ని భావాలను మాటల్లో వ్యక్తీకరించటం కష్టం. ముందుగా భారతీయ సంస్కృతిని, చరిత్రని అధ్యయనం చేసిన ప్రఖ్యాత రచయిత 'నవీన్ పట్నాయక్' గారు చెప్పిన ఒక కథతో మొదలు పెడతాను. ఆయన కథలో ఒక వ్యక్తి అడవి లోకి అక్కడి జంతువులు ఎలా జీవిస్తాయో తెలుసుకుందామని ప్రయాణమయ్యాడు. అడవిలో ఒక పెద్ద పులి అతనికి ఎదురయింది. తననే తీక్షణంగా చూస్తున్న పులిని చూసి అతనికి భయం వేసింది. కొద్దిసేపైన తర్వాత పులి తన దారిన తాను వెళ్ళి

పోయింది. ఆ వ్యక్తికి ఊరట కలిగింది. అతను తిరిగి ఊర్లోకి వచ్చిన తర్వాత మిత్రులు తన అనుభవాన్ని చెప్పమని అడిగితే తన అనుభవాన్ని యధాతథంగా చెప్పడానికి అతనికి చేత కాలేదు. ఎందుకంటే ఆ అనుభవంలో కొత్తదనం ఉంది, భయం ఉంది, బెరుకు ఉంది, ఆందోళన ఉంది, సంతోషం ఉంది..... ఇలా ఎన్నో భావాలున్నాయి. అన్నిటినీ కొన్ని మాటల్లో వ్యక్తీకరించడం కష్టం అనిపించింది. ఆ అనుభూతి పొందాలే తప్ప విశ్లేషించి మాటల్లో చెప్పటం కష్టం. సరిగ్గా శోధయాత్రలో నాకు అటువంటి అనుభూతి కలిగింది. అది కొద్ది మాటల్లో వ్యక్తీకరించడం కష్టం.

ఈ యాత్రలో తెలుగు మాట్లాడి, అర్థం చేసుకోలేని వాళ్ళం మేమేనేమో! అని సంశయంతో పాల్గొన్నాం. నేను, ఒక మిత్రుడు హితేందర్ తరచుగా ట్రెకింగ్ చేస్తాము కనుక నడవడం సమస్య కాదు. తోటి యాత్రీకులతో సంభాషించడమే సమస్య. కానీ ఆశ్చర్యం కలిగించే విధంగా తోటి యాత్రీకులు ఎంతో సహకరించారు. చాలా ఆనంద దాయకంగా సాగిందీ యాత్ర. ప్రకృతిమాత కరుణించిందా అన్నట్లు మా యాత్ర జరిగిన మూడు రోజులూ వాతావరణం ఆహ్లాదకరంగానే ఉంది. కొద్దిగా మబ్బులు కమ్మాయేమో నడక చురుగ్గా సాగింది. మాకీ ప్రాంతం కొత్త. అందంగా ఉన్న పచ్చిక బయళ్ళు, పలక రాళ్ళ గనులు, మారుతున్న ప్రకృతి దృశ్యాలు, నేల రకాలు..... ఇవన్నీ భూగర్భ శాస్త్రవేత్తలమైన మాలాంటి వాళ్ళకి కొత్త ప్రత్యక్ష అనుభవం. మా తోటి యాత్రీకులు మాకన్నా వయసులో చిన్న వాళ్ళయినా, వారి ఉత్సాహం, మాట తీరు, కొత్త ఆలోచనల కారణంగా వారితో సంభాషణ ఇబ్బందికరంగా లేక సజావుగా సాగిపోయింది. బ్రిగేడియర్ గణేశం గారు ఆసక్తి కలిగించే విధంగా ఇన్నోవేటర్ల కథలు వివరిస్తూ ఉండటం యాత్రలో అన్నిటికన్నా రుచికరమైన అంశం. వివిధ వయసుల వారు, ఆలోచనా దృక్పథం, అనుభవాలు కలవారు, వివిధ శారీరక, మానసిక భేదాలు కలిగిన వారు, ఆడ, మగ కలిగిన ఈ గుంపులో యాత్రను చాలా ఆలోచించి చక్కని ప్రణాళికతో నిర్వహించినట్లు అనిపించింది. యాత్ర మొత్తము విద్య, వ్యవసాయము, అభివృద్ధి, సామాజిక స్థితి గతులు, పర్యావరణం మొదలైన అనేక అంశాలపై చర్చలు, వాదనలతో అందరికీ లాభించేలా, అందరూ పాల్గొనేలా కొనసాగింది. వినటానికి, మాట్లాడటానికి అందరికీ






గరికపాటి గ్రామంలోని 90 యేళ్ళ వృద్ధుడు

ఎప్పుడూ అవకాశముండేది. యాత్రలో చిన్నవారు కూడా ధైర్యంగా తమ అభిప్రాయాలు చెపుతుంటే ముచ్చటేసింది. సాధారణంగా నేను నడిచేటపుడు ఎవ్వరితో మాట్లాడను. అటువంటి నాకు నలుగురితో మాట్లాడుతూ నడవటం ఏమీ కొత్త అనిపించలేదు.

ఈ యాత్రలో నాపై చెరగని ముద్ర వేసిన ఒక సంఘటన జరిగింది. యాత్ర చివరి రోజు సుమారు 90 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తిని సత్కరించడం జరిగింది. అంత వయసులోనూ ఆయన ఎంతో ఉత్సాహంగా మాతో పాటలు పాడి నృత్యం చేశాడు. చాలా ఆహ్లాదకరమైన వ్యక్తి అనిపించింది. ఎందుకో ఆయన కాళ్ళకి నమస్కారం చెయ్యాలనిపించి చేశాను. ఈ ప్రాంతాల్లో అలా చెయ్యొచ్చో చెయ్యకూడదో నాకు తెలియదు. అయినా చేశాను. ఆయన నన్ను దగ్గరికి తీసుకొని, ఆశీర్వదించి, నా నుదిటిపై ముద్దు పెట్టుకున్నాడు. ఆయన దీవెన హృదయాంతరాల్లోంచి వచ్చినట్లు అనిపించింది. ఆ ఆత్మీయతా తరంగాలు నన్ను చుట్టివేశాయి. ఈ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఉత్త చేతులతో ఈ యాత్రలో పాల్గొన్న నేను ఎంతో ప్రేమ, జ్ఞానము, సంతోషాలతో పాటు, కొంత అలజడి, నేను దోషినేమో అన్న భావనతో తిరిగి వచ్చాను. ఇంతకు ముందు నేను చాలా సృజనాత్మకత కలిగిన వ్యక్తిని అన్న భావన నాలో ఉండేది. కానీ ఈ యాత్రలో నేను గాంచిన ప్రేమ, ఆదరణ, సృజనాత్మకతల ముందు చాలా అల్పుడిని, దోషిని అనిపించింది. ఏమీ ఆశించకుండా, ఇతరుల కోసమే తన తెలివి తేటలను, సృజనాత్మకతను వాడే వీరెంత గొప్పవారో కదా అనిపించింది. ఇతరులకు పనికి రాని సృజనాత్మకత మనదగ్గర వుండి ఏం లాభం? ఈ యాత్ర నాకు నూతన ఆలోచనలు, కొత్త మార్గాలు చూపించింది. నేనూ వాటిని సద్వినియోగం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. 'పల్లెసృజన' వాలంటీర్లు సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారు. నేనూ వారిలో ఒక భాగం అయినందుకు ఆనందంగా ఉంది. వీరికి ధన్యవాదాలు చెప్పటం చాలా తక్కువ చేసినట్లు అవుతుంది. నాకు తెలియనివి తెలుసుకోవటానికి అవకాశం కల్పించిన పల్లెసృజనకు, భగవంతుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను.

**కునాల్:**

గ్రామీణ భారత దేశంలో ఉన్న సృజనాత్మకతను, ఇన్నోవేషన్లను నలుగురికీ తెలియజేయటానికి, ఆ ఆలోచనలను వ్యాపారాత్మకంగా మార్చుకోవటానికి తగిన సహాయమూ, చేయూత ఇవ్వటానికి ఏర్పడ్డ ప్రత్యేకమైన సంస్థ 'పల్లెసృజన'. ఈ సంస్థ మారుమూల పల్లెల్లో ఉన్న తమతో పాటు, నలుగురికి పనికి వచ్చే ఆలోచనలను వెతికి, వెలికి తీసి


యాత్ర ప్రారంభంలో జరిగిన ముచ్చట

వాటి/ వారి ప్రాచుర్యానికి ఒక వేదిక కల్పించే ప్రయత్నం చేస్తుంది పల్లెసృజన. గ్రామీణ ఇన్నోవేషన్లను వెతికి పట్టుకొని, వాటిని సమాజానికి పనికి వచ్చే విధంగా తీర్చి దిద్ది, తద్వారా గ్రామీణాభివృద్ధికి మార్గాలు చూపించే పని చేస్తుందీ పల్లెసృజన. దేశంలో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల లోని గ్రామీణ ప్రాంతాలలో వున్న ఇన్నోవేషన్లను, సాంప్రదాయ జ్ఞానాన్ని శోధించటానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి పల్లెసృజన చేపట్టే అతి ముఖ్య కార్యక్రమం ఈ 'చిన్న శోధయాత్ర'.

**పల్లెసృజన ముఖ్య ఆశయాలు** – గ్రామీణ ఇన్నోవేటర్లను ప్రోత్సహించడం, – వారికో వేదిక కల్పించడం, – వ్యాపార దృక్పథం అలవర్చటం, – స్వయం సహాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటం, – స్థానిక సంస్కృతీ సాంప్రదాయాలతో మేళవించిన సాంప్రదాయ జ్ఞానాన్ని బహిర్గతం చేయటం మొదలైనవి.

గ్రామాలలో ఉద్భవించిన ఇన్నోవేషన్‌లను నలుగురికీ లాభదాయకంగా ఉండటమే కాకుండా, ఆలోచన చేసిన వ్యక్తికి ఆర్థికంగా ఉపయోగకరంగా ఉండేలా చేయటానికి, ఒకరి ఆలోచ నలను మరొకరితో పంచుకుంటూ కలసికట్టుగా అవకాశాలను చేబుచ్చు కొని స్థానిక ఆర్థిక పరిస్థితి మెరుగు పరుస్తూ పల్లెసృజన పాటు పడు తుంది. ఈవిధంగా గ్రామాలు స్వయం సమృద్ధి సాధించటమే పల్లెసృజన ముఖ్య ఉద్దేశ్యం. కార్యశాలలు, ప్రదర్శనలు, శిక్షణల ద్వారా ఆరోగ్యకర మైన పోటీ కలుగజేసి, ఉత్తమమైన పద్ధతులను, ఆలోచనలను ప్రోత్సహించి తద్వారా గ్రామీణ వికాసానికి తోడ్పడటమే పల్లెసృజన చేస్తున్న పని. ఇంకొక అడుగు ముందుకు వేసి, వ్యక్తుల ఆలోచనలు, తయారు చేసిన వస్తువులు, మెరుగు పరుచుకోవటానికి అవకాశాలు కల్పించి, స్థిరీకరించిన తర్వాత చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొవటానికి ప్రారంభ దశలో కావలసిన కొద్దో గొప్పో ఆర్థిక సహాయం అందించ టానికి కూడా పల్లెసృజన తోడుగా నిలుస్తుంది.

పల్లెసృజన సహాయం అందించిన సంస్థలు వారి వారి గ్రామీణ ప్రాంతాలలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పడు తున్నాయి. ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, వారి జీవనోపాధికి తోడ్పడుతూ అనేక కారణాల వలన గ్రామాలని వదిలివేసి, పట్టణాలకు వలస పోకుండా నిరోధించటమే కాక, ఇంతకు ముందు పట్టణాలకు వలస వెళ్ళిన వారు తిరిగి గ్రామాలకు చేరేలా చేసింది.

పల్లెసృజన చేసిన కృషి వలన ఎంతోమంది పునాది స్థాయి ఇన్నోవేటర్లకు, సాంప్రదాయ జ్ఞానవేత్తలకు స్థానిక, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు కూడా లభించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పల్లెసృజన చేస్తున్న కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని దేశంలోని అనేక రాష్ట్రాలు ఇటువంటి కార్యక్రమా లను చేపట్టి పునాది స్థాయి ఇన్నోవేటర్లను, సాంప్రదాయ జ్ఞానకర్తలను ప్రోత్సహిస్తాయి అనుకుంటున్నాను.

ఈ 45వ చిన్నశోధయాత్ర ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా లో జరిగింది. కొండ్రుముట్ల గ్రామంలో ప్రారంభమై, వేళ్ళవాగు గ్రామంలో యాత్ర ముగిసింది. ఒక ప్రణాళికాబద్ధంగా జరిగిన ఈ యాత్ర బ్రిగేడియర్ గణేశం, అంజిరెడ్డి గార్ల ఆధ్వర్యంలో సుహృద్భావ వాతావరణంలో జరిగింది. క్షేత్ర స్థాయిలో వివరాలు గ్రహిస్తూ, స్థానికుల తో మాట్లాడుతూ అనేక పల్లెలు దాటుతూ స్థానిక వ్యక్తులను కలుస్తూ ఇన్నోవేటర్లను, జ్ఞానకర్తలను గుర్తిస్తూ, వారి సాధక బాధకాలు చర్చిస్తూ సాగిందీ యాత్ర. ఈ యాత్ర ద్వారా ఆ ప్రాంతపు గ్రామీణులలోనే కాక, అక్కడి వ్యక్తుల సృజనాత్మక ఆలోచనలను కూడా రేకెత్తించింది అనటం లో సందేహం లేదు.

కనుమరుగై పోతుంది అనుకుంటున్న సాంప్రదాయ జ్ఞానాన్ని పరిరక్షించటంలోను, వెలి తీయటంలోను పల్లెసృజన చేస్తున్న కృషి వెలకట్టలేనిది. ఈ యాత్రలో యాత్రీకులు తమలో తాము ఆలోచనలను పంచుకోవటమే కాక, గ్రామీణ ఇన్నోవేటర్లు, సాంప్రదాయ జ్ఞానకర్తలతో కూడా ఆలోచనలను పంచుకొనే అవకాశం లభించింది. అన్నిటికన్నా ముఖ్యం మనం సామాన్యుడు అనుకున్న వ్యక్తుల వద్ద ఎంత అసామాన్య మైన ఆలోచనలు ఉన్నాయో కదా అని తెలుసుకున్నాను. గ్రామ స్థాయి ఇన్నోవేషన్లు, జ్ఞానానికి, విధాన నిర్ణయాలు చేసే వారికి మధ్య సంధాన కర్తగా ఉంటూ పల్లెసృజన లాంటి సంస్థలు, వాలంటీర్లు పని చేస్తున్న పద్ధతి చూస్తూ వుంటే గ్రామీణ స్థాయి జ్ఞానానికి తగిన ప్రోత్సాహ మిచ్చే విధాన నిర్ణయాలు అమలు చేస్తే ప్రతిభావంతమైన పల్లె జ్ఞానం కోట్లాది ప్రజలు చేరే అవకాశముందని నేను భావిస్తున్నాను.

**నాగమోహన్:**

ఈసారి 45వ చిన్న శోధయాత్ర మా పల్నాడు ప్రాంతంలో అని తెలిసి చాలా ఆనంద పడ్డాను. యాత్ర ప్రారంభం అయ్యే కోండ్ర


నాగమోహన్‌తో జాజి

ముట్ల గ్రామం నేను పుట్టి పెరిగిన సత్తెనపల్లికి సుమారు 70 కి.మీ. దూరంలో ఉంది. ఇదివరకు ఇది గుంటూరు జిల్లాలో ఉండేది, ఇప్పుడు పల్నాడు జిల్లా అయింది.

ఒక్కసారి నాకు చిన్నతనం గుర్తుకు వచ్చింది. అప్పటి గ్రామాలు, ఇళ్ళు, మనుషులు, భాష, యాస గుర్తుకు వచ్చాయి. ఇది నా 8వ యాత్ర. దీని ప్రత్యేకత ఏమిటంటే నేను కారంపూడికి చెందిన 'జాజి' గారిని కలవటం. ఈయన అడవులలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి నిస్వార్థంగా అడవుల రక్షణకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. ప్రజలు పిచ్చివాడు అనుకున్నా, పనిలేని వాడు అనుకున్నా ప్రకృతిమాత అడవి తండ్రికి పుట్టిన ముద్దు బిడ్డగా జాజి గారు తనపని తాను ఆనందంగా, నిరుత్సాహ పడకుండా చేస్తూ పోతూనే ఉన్నాడు ఈ నిస్వార్థ జీవి. ఈ జన్మలో ఆయన్ని మర్చిపోలేను.

యాత్ర ప్రారంభమైన కొండ్రముట్ల గ్రామంలో పాఠశాల చాలా బాగుంది. ప్రత్యేకించి మరుగు దొడ్లు చాలా శుభ్రంగా ఉన్నాయి. ఆశ్చర్యము, ఆనందము వేసింది. అక్కడ బ్రిగేడియర్ గారు యాత్రీకులను ఉద్దేశించి యాత్రలో నడుచుకోవలసిన విధానము, చేయ వలసినవి, చేయకూడనివి రివాజుగా చెప్తూ ఉంటే నేను పక్కనే ఉన్న ఇంకొక తరగతిలో టీచర్ గారు ఇంగ్లీషులో సామాజిక శాస్త్రం చెప్తూ ఉండగా చూసి సంతోషించాను. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ఉండటం శుభ సూచకము అనిపించింది.

క్రిష్ణ, మోహన్, సుభాష్, పరశురామ్ లు మా సామాన్లు, టీ కాఫీలు, ఆహారం సంగతి చాలా చక్కగా చూసుకునే వారు. ఒకరిద్దరు తప్పించి నేను అందరి యాత్రీకులతో మాట్లాడాను. అమిత్, జితేంద్రలు మన భాష కాకపోయినా చక్కగా కలిసి పోయారు. యువకులంతా మంచి క్రమ శిక్షణతో మెలిగారు. వాళ్ళ ఉత్సాహము, ఉత్సుకత, శక్తి చూస్తుంటే ముచ్చటేస్తుంది. కొందరు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినందుకు ఎక్కువ ఉత్సాహం చూపించారు అనుకున్నాను.

మధ్య మార్గంలో నాగేశ్వరరావు, రామకోటి అనే గొర్రెల కాపరులను చూశాను. వారిద్దరికీ చెరో 30 మేకలున్నాయి. సంవత్సరానికి 5–6 లక్షల రూపాయలు సంపాదిస్తారట. వాళ్ళని కేవలం మేకలనే ఎందుకు పెంచుతున్నారు, గొర్రెలను ఎందుకు పెంచటం లేదు అని అడిగితే, గొర్రెలు కేవలం గడ్డి మాత్రమే తింటాయి, వాటికై ప్రత్యేకంగా గడ్డి మడులు వేయాల్సి ఉంటుంది. కానీ, మేకలు ఏ ఆకులు, అలములైనా తినేస్తాయి. పెంచటం సులభం. ఈ సంఘటన బొల్లపల్లి అడవుల్లో జరిగింది. ఒకచోట గొర్రెలు చెట్లమీద ఆకులు తింటూ ఉండగానే నాగేశ్వర రావు అనే అతను వాటిని తొందర చేసి ముందుకు నడవమం



యాత్రీకులు పాఠశాల విద్యార్థుల క్రియాశీలతను వెలికి తీసే ప్రయత్నం



పాఠశాల విద్యార్థులతో ఇన్నోవేషన్లపై చర్చ

టున్నాడు. అలా ఎందుకు తిననీయ కూడదా అంటే వాటికి ఆకులతో పాటు నీరు కూడా ఇవ్వాలి. అందుకనే నీటి గుంటకి వెళ్ళటానికి తొందర చేస్తున్నాను అన్నాడు. ఇది గ్రామస్తుల జ్ఞానం అనుకున్నాను. ఏ పుస్తకం లోనూ ఇది రాసినట్టు నేను చూడలేదు.

ఈ మూడు రోజుల ప్రయాణంలో 'నాగులేరు' ని మూడుసార్లు దాటాము. ఇది ఆ ప్రాంతంలో కొండల నుంచి వచ్చి క్రిష్ణా నదిలో కలుస్తుంది. నాగార్జున సాగర్ దగ్గరలోనే ఉన్నా ఈ ప్రాంతపు పొలాలు ఎప్పుడూ నీటియెద్దడికి గురౌతునే ఉంటాయి. 1000 అడుగుల లోతుకు వెళ్ళినా బోరు బావిలో నీళ్ళు వస్తాయన్న నమ్మకం లేదు.

రేగిడిచెర్ల గ్రామంలో గోలీ సోడ తాగటం, డ్రాగన్ ఫలాల తోటకు వెళ్ళటం, ఇన్నోవేటర్ గురవయ్య గారితో మాట్లాడటం ఈ శోధయాత్రలో ప్రత్యేకం. ఇలా మైలు తర్వాత మైలు నడుస్తూ ఉంటే కొత్త ప్రదేశాలు చూడటం, కొత్త మనుషులను కలుసుకోవటం, తోటి యాత్రీకులతో సంభాషించటం, వారు చెప్పేవి వినటం.... ఇలా ఎన్ని శోధ యాత్రలలో పాల్గొన్నా ప్రతి శోధయాత్ర కొత్తగానే ఉంటుంది.

అడవిలో జాజి గారు తీసుకు వచ్చిన విత్తనపు బంతులు విసరడం ఓ కొత్త అనుభవం. మేము మా బంతులను తయారు చేయక పోయినా, అడవికి చాలా మేలు చేశామన్న భావన కలిగింది. ఆయన రోజూ చేసే పనే అయినా తనతో పాటు మేము కూడా కొంత చెత్త చెదారం, పగిలిపోయిన సీసాలు, ప్లాస్టిక్ చెత్త శుభ్రం చేసి, గొప్పగా కొన్ని ఫొటోలు తీసుకున్నాం. మేళ్ళవాగు దగ్గర చాలా పెద్ద రావిచెట్టు, దాని క్రింద నాగ ప్రతిష్ఠలు చేసి ఉండటం గమనించాము. చివరి రోజు మధ్యాహ్నం భోజనంలో గుంటూరు కారం కలిగిన గోంగూర పచ్చడి తిన్నాం. అంత కారం తింటారు కనుకనే పల్నాడు ప్రాంతం వారికి పౌరుషం ఎక్కువ అనిపించింది. అందుకేనేమో కారంపూడి వద్ద పల్నాటి యుద్ధం మాచెర్ల – గురజాలల మధ్య జరిగింది.

యాత్ర పూర్తయిన తర్వాత కొద్దిమంది యాత్రీకులం కారంపూడి లో జాజి గారి ఇంటికి వెళ్ళాము. వాళ్ళ ఇంటివద్ద వున్న గుట్టపైన నర్సింహ క్షేత్రం దర్శించాము. అక్కడ గుట్టపై విచిత్రమైన కొలను చూశాము. దానిలోని నీళ్ళు పొంగి పొరలదు, ఎండిపోదు, ఎల్లప్పుడూ స్వచ్ఛందంగా ఉంటాయి. అక్కడే వీరుల గుడి చూశాము. అక్కడ దేవుళ్ళు ఎవరూ ఉండరు. పల్నాటి యుద్ధంలో జరిగిన వీరులు వాడిన ఆయుధాలు ఉంటాయి. అక్కడే జాన కాయలు తిన్నాము. నేరుగా చెట్టుమీదనుంచి కోసుకొని తింటూ ఉంటే చిన్నతనం గుర్తుకు వచ్చింది. ద్విగుణీకృత ఉత్సాహంతో నూతన శక్తితో కొత్త జ్ఞానం సంపాదించుకొని పాత ప్రపంచాన్ని ఎదుర్కోవటం కోసం హైదరాబాద్ చేరుకున్నాము. ●

# పల్లె జ్ఞానం

'పల్లెసృజన' స్కౌట్ ముప్పారపు రాజు దాదాపు 40 చిన్న శోధయాత్రలు నిర్వహిస్తూ, సేకరించిన సాంప్రదాయ జ్ఞానాన్ని ఇక్కడ వివరిస్తున్నాము. పాఠకులు చుట్టుప్రక్కల ఉన్న విజ్ఞులతో చర్చించి వాటిని తగు జాగ్రత్తలతో ఆచరించాలని కోరుతున్నాం. - ఎడిటర్.

**బొల్లెపల్లి జనార్థన నాయుడు,** బోనుపల్లి గ్రామం, తొట్టెంబేడు మండలం, చిత్తూరు జిల్లా.

**కామెర్ల రోగానికి ఔషధం:**

పచ్చ కామెర్ల రోగం గురించి చాలా మందికి తెలుసు. ఈ రోగానికి గురైనవారు డాక్టర్ల వద్దకు వెళ్ళి ఎంతో సమయం, డబ్బు వృధా చేసుకుంటూ ఉంటారు. పచ్చకామెర్ల రోగానికి పూర్వం నుండి సాంప్రదాయ వైద్యం వల్లనే ఎక్కువ మందికి నయమయ్యేది. సరైన వైద్యం చేయకుంటే ఇది ప్రాణాంతకంగా కూడా మారే ప్రమాదం ఉంది. దీని నివారణకు నేలవేము, నేలఉసిరి ఆకులను తీసుకుని మెత్తగా దంచి, అందులో 5 గ్రా. మిరియాలు, 5 గ్రా. వెల్లుల్లి లను కలిపి అన్నింటిని కలిపి మరోసారి మెత్తగా నూరి చిన్న చిన్న మాత్రలుగా (చింత గింజ పరిమాణంలో) చేసుకుని ప్రతిరోజు 3 పూటలా భోజనం తర్వాత తీసుకున్నట్లయితే కామెర్లు త్వరగా తగ్గుముఖం పడతాయి.



**విష జ్వరానికి ఔషధం:**

కొంత మందికి విష జ్వరాలు వచ్చి చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాయి. అటువంటి రోగులకు 'గుప్పెడు నేలవేము ఆకు, 10 గ్రా. మిరియపు గింజలు, 5 వెల్లుల్లి పాయ రెబ్బలను తీసుకుని మెత్తగా నూరి చిన్న చిన్న ఉండలుగా చేసుకుని రోజుకు రెండుసార్లు (20 గ్రా.) తీసుకుంటే విష జ్వరం త్వరగా తగ్గుముఖం పడుతుంది.

**క్షయ వ్యాధి నివారణకు మందు:**

పొడపత్రి, సుందాకు ఆయుర్వేద మందులు మూలికలు అమ్మే దుకాణాల్లో లభిస్తాయి. వీటిని తెచ్చుకొని మెత్తగా పొడిచేసి వేర్వేరుగా గాజు సీసాలో భద్రపరచుకొని ఉంచుకోవాలి. ఇంట్లో ఎవరికి జ్వరం వచ్చినా సరే ప్రతిరోజు ఉదయం, సాయంకాలం ఒక చెంచాడు పొడపత్రి, అర చెంచాడు సుందాకు పొడిని తీసుకుని, ఒక గ్లాసు మజ్జిగలో వేసుకుని బాగా కలిపి త్రాగుతూ ఉంటే క్షయ వ్యాధి త్వరలో తగ్గుముఖం పడుతుంది. ఈ ఔషధం వాడేటప్పుడు మాంసాహారం తీసుకోకూడదు.

**మధుమేహం (షుగర్) వ్యాధికి ఔషధం:**

మధుమేహం (చక్కెర వ్యాధి) ఇప్పుడు చాలా మందిని పట్టి పీడిస్తున్న మహమ్మారి అనటంలో ఎటువంటి సందేహం లేదు. ఈ మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకునేందుకు చాలా మంది డాక్టర్లను సంప్రదించి, వేలాది రూపాయలు వెచ్చించి, జీవితాంతం మాత్రలు వాడుతునే ఉన్నారు. కానీ, ఈ మధుమేహం వ్యాధిని నియంత్రణలో ఉంచుకునేందుకు ప్రకృతి మనకెన్నో మూలికలను ప్రసాదించింది. ఈ వ్యాధి ఉన్నవారు 50 గ్రా. నేరేడు గింజలు, 50 గ్రా. నేలవేము ఆకులు కలిపి మెత్తగా నూరి ఒక సీసాలో భద్రపరచుకొని, రోజూ ఉదయం పరగడుపుననే పాలు/ కాఫీ/ నీళ్లు లో ఒక టీస్పూన్ పొడిని వేసుకుని తీసుకుంటూ వుంటే మధుమేహం నియంత్రణలో వుంటుంది. దీని కొరకు ఎంతో డబ్బు ఖర్చు చేసుకుని మాత్రలు ఉపయోగించాల్సిన అవసరం లేదు.

**బహిష్టు అయినవారి కడుపు నొప్పి నివారణకు చిట్కా:**

కొంతమంది స్త్రీలు బహిష్టు అయినపుడు కడుపు నొప్పితో బాధపడుతుంటారు. అలాంటివారు చింత గింజలను వేడి చేసి, పొడిగా చేసుకొని ఒక సీసాలో భద్రపరచుకొని రోజుకు రెండుసార్ల చొప్పున రెండు రోజులపాటు ప్రతిపూట రెండు చెంచా పొడిని నీటిలో కలుపుకుని త్రాగితే కడుపు నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు.

**పి. శ్రీనివాసులు,** కారాకొల్లు గ్రామం, తొట్టెంబేడు మండలం, చిత్తూరు జిల్లా.

**విరిగిన ఎముకలు అతుక్కోవటానికి ఔషధం:**

ప్రస్తుతం ఏదైనా ప్రమాదం వల్ల ఎముకలు విరిగితే ఆసుపత్రికి వెళ్ళిన వెంటనే డాక్టర్లు రాడ్లు వెయ్యాలి, ఆపరేషన్ చెయ్యాలి అంటూ వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. కానీ పూర్వం ఎముకలు విరిగినప్పుడు అవి అతుక్కునేందుకు సాంప్రాదయ వైద్యులు చేసే వైద్య చిట్కాలలో ఒకటి ఈ వైద్యం.

'పెంట చెన్నంగి' చెట్టు ఆకులను మెత్తగా నూరి, ముద్దగా చేసి, ఆకు పసరును ఒక మెత్తటి గుడ్డకు రాసి ఉంచుకునేవారు. ఆ తర్వాత తమలపాకులు తినేటప్పుడు వేసుకునే సున్నంను విరిగిన ఎముక దగ్గర పలుచగా రాసి, విరిగిన చోట వెదురు బద్దలను పెట్టి, పసరు రాసిన గుడ్డను చుట్టి, దానిపైన కోడిగుడ్డు పచ్చసొనను వేసి కట్టు కట్టేవారు. ఇలా 4 రోజులకోసారి కట్టు మారుస్తూ వుంటే విరిగిన ఎముకలు త్వరగా కట్టుకునేవి.



**బొమ్మెరబోయిన క్రిష్ణవేణి**, నర్సంపేట, వరంగల్ జిల్లా :

**స్త్రీలలో ఋతుక్రమం తప్పకుండా రావటానికి:**

కొంతమంది స్త్రీలు ఋతుక్రమం రావటంలో క్రమం తప్పినపుడు ఆందోళనకు గురవుతూ ఉంటారు. అటువంటి స్త్రీలు ఈ చిట్కాను ఉపయోగించినట్లయితే ఋతుక్రమం క్రమం తప్పకుండా వస్తుంది. ఔషధం తయారు చేసుకునేందుకు గింజలు తీసిన 4 ఎండు ఖర్జూరపు పండ్లను, 2 కొమ్ముల శొంఠిని తీసుకుని వాటిని మెత్తగా దంచుకొని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఆ పొడిని ప్రతి రోజూ ఉదయం ఒక చెంచాడు తీసుకుని వేడి పాలలో కలిపి తీసుకుంటూ వుంటే ఋతు క్రమం తప్పకుండా మామూలుగా వస్తుంది. ఇలా ఒక మండలం (41 రోజులు) పాటు చేస్తే చాలు.

**వెంట్రుకలు బాగా పెరగటానికి:**

తలలో వెంట్రుకలు సరిగ్గా పెరగక చాలా మంది ముఖ్యంగా మహిళలు ఇబ్బందికి గురవుతూ ఉంటారు. అటువంటి వారు వెంట్రుకలు ఒత్తుగా పెరగడానికి 'గుంట గరగర' ఆకులను సేకరించి, మెత్తగా నూరి (కొద్దిగా నీరు చిలకరిస్తూ నూరుకోవాలి), ఆ ముద్దతో పసరుని పిండాలి. అలా సేకరించిన పసరును ఒక పాత్రలో వేసుకుని ఆ పసరు సగం అయ్యే వరకు పొయ్యిపైన పెట్టి మరిగించాలి. చల్లారిన తర్వాత తల వెంట్రుకలకు రాసుకుని, 30 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఇలా మూడు రోజులకోసారి చేస్తూ వుంటే తలవెంట్రుకలు బాగా పెరుగుతాయి.



**తలలో చుండ్రు నివారణకు:**

తలలో చుండ్రు ఏర్పడటం వల్ల తల దురదగా ఉండటమే కాక, తల గోక్కున్నపుడు తెల్లటి పొట్టు బట్టలపై పడటం వల్ల చాలా మంది విసుగు చెందుతూ ఉంటారు. పైగా దీన్ని నివారించకుంటే తల వెంట్రుకలు కూడా త్వరగా రాలిపోయే ప్రమాదం కూడా ఉంది. తలలో చుండ్రు నివారణకు మందారం చెట్టు ఆకులను తీసుకుని మెత్తగా నూరి, అందులో కొంచెం నిమ్మరసం కలిపి తలని బాగా మర్దన చేస్తూ పట్టించి ఒక గంట తర్వాత తలస్నానం చేయాలి. ఇలా మూడురోజులకు ఒకసారి చొప్పున చేస్తూవుంటే తలలో చుండ్రు నివారించబడుతుంది.



**నెలసరి నొప్పి తగ్గించుటకు:**

కొంతమంది మహిళలకు ఋతుక్రమం జరిగినపుడు విపరీతమైన నొప్పికి గురవుతూ ఉంటారు. అటువంటి వారు దుసరతీగ ఆకులను సేకరించి వాటి పసరును తీసి, ఒక గ్లాసులో పోసి అందులో కండచక్కెరను వేసి రెండు గంటల తర్వాత త్రాగాలి. ఇలా రోజూ 20 మి.లీ. చొప్పున ఉదయంపూట పరగడుపుననే త్రాగితే నెలసరి నొప్పి తగ్గిపోతుంది.

**ముఖంపై నల్లమచ్చల నివారణకు:**

కొందరు యువతీ యువకులకు, ముఖ్యంగా మహిళలు ముఖంపై నల్లటి మచ్చలు ఏర్పడటం వల్ల ఎంతో ఇబ్బందికి గురవుతూ ఉంటారు. అటువంటి వారు ప్రతిరోజూ ఉదయంపూట 'నానబాల' మొక్క పాలను సేకరించి, ముఖంపైవున్న నల్లమచ్చలపై రాసి, పది నిమిషాల తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తూవుంటే ముఖంపైనున్న నల్లమచ్చలు త్వరగా తగ్గిపోతాయి.



**డి. గోవర్ధన్,** వెంకటాపురం గ్రామం, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా.

**కోళ్ళ ఫారాల్లో 'కొడిసె' నివారణకు:**

కోళ్ళ ఫారాలు కొడిసె బారిన పడటంతో కోళ్ళకు నష్టం వాటిల్లుతుంది. ఇలా కొడిసె బారిన పడిన కోళ్ళు సరిగ్గా ఎదగవు. దీని నివారణకు 20 లీటర్ల నీటిలో 100 గ్రా. పొగాకుని నానబెట్టి ఆ నీటిని కోళ్ళ ఫారంలో స్ప్రే చేస్తే కొడిసె (కోడిపేను) తగ్గిపోతుంది.

## ప్రకృతి వైద్యాన్ని కాపాడుకుందాం

పాఠకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ వైద్యులు కనుమరుగై పోతున్నారు. కొన్ని గ్రామాల్లో వైద్యులతోనే చాలా వరకు రోగాలు నయమై పోతున్న విషయం అందరికీ తెలిసిందే. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం, వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తం చేయటం ఎంతో అవసరం. మీకు తెలిసిన సాంప్రదాయ (నాటు/ ఆయుర్వేద) వైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. వాటిని ప్రచురించి అందరికీ అందజేద్దాం, తరతరాల జ్ఞానాన్ని రాబోయే తరాలకు అందిద్దాం. - ఎడిటర్



'హనీబీ నెట్‌వర్క్', 'పల్లెసృజన' ల ద్వారా వెలుగులోకి వచ్చిన

'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న సామాన్యులు

Padma Shri Awards



స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

# "పద్మశ్రీ" పురస్కార గ్రహీత, నిరంతర ప్రకృతి సేవకుడు 'వనజీవి' దరిపల్లి రామయ్య



సృష్టి సమ్మాన్ - 2015



పద్మశ్రీ పురస్కారం - 2017

ఒక సామాన్య జీవి కనీసం 10వ తరగతి కూడా పూర్తి చేయలేకపోయిన వ్యక్తి చుట్టాలు, తెలిసిన వాళ్ళ మధ్య హాస్యాస్పదమైన వ్యక్తి, చివరికి పిచ్చివాడు అనిపించుకున్న వ్యక్తి జాతీయ స్థాయిలో మన రాష్ట్ర అధ్యక్షుని ద్వారా "పద్మశ్రీ" పురస్కారం పొందితే ఆశ్చర్యం వేస్తుంది. అందులో ఆ వ్యక్తి మన తెలుగు వాడే అన్న సంగతి తెలిస్తే ఆనందం కలుగుతుంది.

చెట్ల రామయ్య లేదా వనజీవి రామయ్య గా పేరుగాంచిన 'దరిపల్లి రామయ్య' ఖమ్మం జిల్లాలోని, రెడ్డిపల్లి గ్రామంలో 1 జులై, 1937లో జన్మించాడు. విత్తనాలు నాటాలి, చెట్లు పెంచాలి అన్న ఆలోచనే పరమావధిగా పెరిగిన ఈయనకి ఈ ఆలోచన ఎందుకు వచ్చింది అని అడిగితే ఏమో నాకు తెలియదు. నా చిన్నతనంలో మా అమ్మ వంట చేసేటప్పుడు, రానున్న కాలంలో నాటడం కోసం కూరగాయల విత్తనాలు తీసి దాచుకోవటం గమనించే వాడిని. బహుశా విత్తనం వేస్తే చెట్టు వస్తుందని అప్పుడే తెలిసి ఉంటుంది నాకు. చిన్నప్పటి నుంచి ఈ ఆలోచన ఉన్నా, ఎప్పటి నుంచి ఈ అలవాటు ఉధృతం చేశానో నాకు గుర్తు లేదు. నా గురించి రాసేవాళ్ళు కనీసం గత 50–60 సంవత్సరాల నుంచి ఈ పని చేస్తున్నాడు అని రాస్తూ ఉంటే అంతే అనుకున్నాను.

మామూలు అడవులు కాకుండా, సామాజిక అడవులు పెంచడం ముఖ్యమని అదే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న రామయ్య మానవాళి మనుగడకి విత్తనమే ప్రధానం అంటాడు. భూమి మీద బ్రతికే అన్ని జీవ రాశులలో మానవ జన్మ ఉత్కృష్టమైనది అంటారాయన. మనిషికి మెదడు ఉంది, అతను ఆలోచించ గలడు, చేయ గలడు, చేయించ గలడు. ప్రకృతి కూడా మనుష్య జాతిమీద తన అపారమైన కృపను చూపుతూనే ఉంది. కనుక మనిషికి కూడా ఆ ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోవలసిన బాధ్యత ఉంది. చెట్లనే కాదు, దేవుడు సృష్టించిన దేన్నయినా రక్షించుకోవలసిన బాధ్యత మనిషికే ఉంది. భవిష్యత్తులో తరతరాల వరకు మనిషి బ్రతకాలి అంటే ఇప్పుడు ప్రకృతిని రక్షించుకోవాలి.

'చెట్టు నాటండి – ఒక జీవిని రక్షించండి' అని చెట్ల గురించి, అవి మనకు చేసే మేలు గురించి ఉపన్యాసాలు ఇవ్వకుండా, కార్యరూపంలో చూపించిన వ్యక్తి దరిపల్లి రామయ్య. ఈయన ఉదయమే లేచి, జేబునిండా విత్తనాలు వేసుకొని సంచుల నిండా మొక్కలు పెట్టుకొని సైకిలు మీద బయలుదేరేవాడు. ఎక్కడ చెట్లు లేని ప్రదేశం కనిపించినా, అక్కడ విత్తనమో, మొక్కో నాటేవాడు. మన పర్యావరణాన్ని రక్షించటానికి దాంట్లో సమతుల్యం పాటించటానికి మానవులు – ఇతర జీవాల జీవితాలు సజావుగా సాగిపోవటానికి చెట్లు ఎంత ముఖ్యమో తెలిసిన వ్యక్తి కనుక తక్కువ మాట్లాడుతూ ఎక్కువ పని చేసేవాడు. ఈ ప్రయాణంలో ఈయనకి ఈయన భార్య లేదా బడిపిల్లలు సహాయం చేసేవారు. తాను ఎక్కువ చదువుకోక పోయినా, పర్యావరణం గురించి, చెట్ల గురించి, వాటి రకాల గురించి అన్ని కాలాలలో పచ్చగా ఉండే చెట్ల గురించి, చెట్లను ఎలా పెంచాలి అన్న విషయం గురించి అనేక పుస్తకాలు చదివా



డు. ఆయనని అప్పుడు, ఇప్పుడు కూడా 'నడుస్తున్న చెట్ల చరిత్ర తెలిసిన సర్వ విద్యా సంగ్రహము' అని చెప్పుకోవచ్చు.

ఈయనను ఎవరు, ఎప్పుడు చూసినా జేబు నిండా విత్తనాలతో కనిపిస్తాడు. తను తిరిగిన ప్రతి చోట ఈ విత్తనాలను వెదజల్లటం అలవాటుగా చేసుకున్నాడు. మొక్కలు నాటడం నాకు కేవలం అభిరుచి మాత్రమే కాదు అది జీవిత ధ్యేయం అని అంటారు. నా చుట్టు పక్కల ప్రాంతంలో ఏ బంజరు భూమి కనిపించినా అక్కడ చెట్లు నాటుతాను. నేను నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడటమే నా లక్ష్యం. ఒక్క మొక్క వాడిపోయి చనిపోయినా నాకు ప్రాణం పోయినంత బాధ కలుగుతుంది.

రామయ్యను ఇలా ఎన్ని మొక్కలు నాటావు అని అడిగితే, నాది ఒక్కటే లెక్కండీ, చెట్లు నాటడం. ఎన్ని నాటాను అంటే లెక్కపెట్టి నాటలేదు ఎప్పుడూ. చెట్లు నాటడం నా జీవితంలో ఒక భాగం. ఎవరో లెక్కేసి చెప్పారు కోటికి పైగా చెట్లు నాటాడు అని. ఇంతేనా అనిపించింది నాకు.

రామయ్య గారికి సరైన జోడీ ఆయన భార్య జయమ్మ. ఈయనని ఎప్పుడూ ఎందుకు ఇలా చేస్తున్నావని అడిగిన పాపాన పోలేదు. విత్తనాల కోసం తన మూడెకరాల పొలం అమ్మేసినా అడగ లేదు. పైగా ఈయన లాగే తలపైన 'వృక్షో రక్షతి రక్షితహ' అని రాసి వున్న కిరీటం పెట్టుకొని తిరుగుతూ ఉంటుంది. అదేంటని అడిగితే మా ఆయన లాగానే చెట్లని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అని నేనూ నమ్ముతాను అంటుంది.

ఈ జంట ఏ శుభ కార్యానికి వెళ్ళినా, సమావేశాలు, సదస్సులకు వెళ్ళినా, పుట్టినరోజు, పెళ్ళిల్లకు వెళ్ళినా బహుమతిగా మొక్కలు ఇవ్వటం ప్రారంభించారు, కొనసాగిస్తూనే ఉన్నారు. వీరి పరిచయస్తులు అందరు కూడా అదే అలవాటుగా చేసుకున్నారు. ఇప్పుడు పెద్ద పెద్ద సమావేశాలలో అతిథులకి పూల హారం, బొకేలు ఇచ్చే బదులు మొక్కలు ఇవ్వటం రివాజుగా మారింది అంటే దానికి ఆధ్యుడు ఈయనే అని చెప్పుకోవచ్చేమో.

ఈయన చేసిన, చేస్తున్న ఈ నిర్విరామ కృషికి అనేక స్థాయిలలో బహుమానాలు, అవార్డులు వచ్చిన తర్వాత కానీ గుర్తింపు రాలేదు. ఎన్నో పురస్కారాలు అందుకున్న తర్వాత ఈయన జీవిత చరిత్రని జల్లి నరేష్ గారు 'విత్తనం నుండి పద్మం వరకు – వనజీవి ప్రయాణం' అన్న పేరిట గ్రంథస్తం చేశారు. ఆ తర్వాత ఈయన గురించిన వివరాలు బయటకు రావటం మొదలయ్యాయి. ఈయన ప్రకృతిని సస్యశ్యామలం చేయటంలో పడుతున్న వేదన, చేస్తున్న కృషి నలుగురి దృష్టికి వచ్చింది. బడి పిల్లల పుస్తకాలలో ఈయనకు చెందిన అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చటం రాష్ట్ర ప్రభుత్వం ఈయనకిచ్చే గౌరవం అని చెప్పుకోవచ్చు.





రామయ్య పర్యావరణానికి చేస్తున్న అవిరళ కృషికి కొత్తగా ప్రాచుర్యం వస్తున్న రోజులలో జాతీయ స్థాయిలో కూడా ఈయన సేవని పరిచయం చేయాలన్న సదుద్దేశ్యంతో 'పల్లెసృజన' వీరిని 'సృష్టి సమ్మాన్' పురస్కారానికి సిఫారసు చేసి ఆయన చేస్తున్న ప్రకృతి సేవలో తనూ భాగస్వామి కాగలిగింది. ఆయనకి 2015లో ఢిల్లీలోని భారత రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి నేషనల్ ఇన్నోవేషన్ ఫెస్టివల్ కార్యక్రమంలో 'సృష్టి సమ్మాన్–2015' పురస్కారంతో సత్కరించడం జరిగింది. ఇది నాందిగా జాతీయ స్థాయిలో 2017లో భారత ప్రభుత్వం ఈయనను 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. అతని హరిత ప్రచారానికి గుర్తింపుగా జాతీయ అవార్డులతో పాటు, అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ సంస్థ వారు 'గౌరవ డాక్టరేట్'ను ప్రదానం చేసింది. ఈయనకు పద్మశ్రీ పురస్కారం రాకముందే తెలంగాణ ప్రభుత్వం తమ రాష్ట్రంలో ఉన్న భూ భాగంలో కేవలం 24 శాతమే పచ్చదనం ఉందని, దానిని కనీసం 33 శాతానికి పెంచాలన్న ధ్యేయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణకు హరిత హారం' అన్న ఆలోచనలో భాగంగా జూన్ 2, 2016న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా వీరికి లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేసింది. (ఆ లక్ష రూపాయలు ఎన్ని విత్తనాలుగా మారి, ఇప్పటికి ఎన్ని వృక్షాలుగా అయ్యుంటాయో ఆయనకే తెలిసి ఉండాలి).

**దరిపల్లి రామయ్య కు లభించిన అనేక పురస్కారాలలో కొన్ని.....**

1995లో 'సేవా పురస్కారం'

2005లో 'వనమిత్ర' పురస్కారం

2015 లో 'సృష్టి సమ్మాన్' పురస్కారం

2017లమో 'పద్మశ్రీ' పురస్కారం.

వచ్చిన పేరు ప్రతిష్ఠలు, పురస్కారాలతో నిమిత్తం లేకుండా తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరిస్తున్న పద్ధతిని కొనసాగిస్తూ ప్రపంచాన్ని పచ్చగా మార్చటానికి తన ప్రయత్నం కొనసాగిస్తున్న 'వనజీవి, ధన్యజీవి' మన దరిపల్లి రామయ్య. వాళ్ళ జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో మరెంతో మంది రామయ్య లాంటి వారు తయారు కావాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'

## గ్రాస్ రూట్స్ ఎంటర్ప్రెన్యూర్ గా మారిన ఎంబిఏ పట్టభద్రుడు

# బొడ్డు సుభాష్ - వినూత్న జీవన పథం




- పి.రాఘవ రెడ్డి

వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన బొడ్డు సంజీవయ్య, సుగుణల ఐదుగురు సంతానంలో రెండవ కుమారుడు బొడ్డు సుభాష్ చందర్. దిగువ మధ్య తరగతికి చెందిన సంజీవయ్య దంపతులు పిల్లలను ఎంతో కష్టపడి బాగా చదివించారు. సుభాష్ వాళ్ళు నలుగురు అన్నదమ్ములు, వీరికి ఒక చెల్లెలు. చిన్నప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు, కష్టాలు, కుటుంబ సమస్యలు, బాధలు అన్నీ తెలిసిన వాడు. తన తండ్రి తరచూ 'గుడిని, బడిని నమ్ముకున్న వాడు జీవితంలో చెడిపోడు' అని చెప్పి అందరూ చదువు పట్ల శ్రద్ధ వహించేలా చెప్పిన మాటల వల్ల అందరూ మంచి చదువులు చదవ గలిగారు. అన్న ధనుంజయ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు, సుభాష్ ఎంబిఏ చదివాడు, ఇతని తర్వాత చెల్లి ఎమ్మెస్సీ చేసింది, పెద్ద తమ్ముడు ఐటిఐ చదవగా, చివరి తమ్ముడు డిగ్రీ పూర్తి చేశాడు. మధ్య తరగతి కుటుంబం కాబట్టి డబ్బు, కష్టం విలువ బాగా తెలిసినవాడు కాబట్టి తన కుటుంబం ఆర్థిక కష్టాల గురించి బాగా ఆకళింపు చేసుకున్నాడు. అందుకే ఇతనికి చిన్నప్పటి నుండి ఓపిక, సహనం ఎక్కువ. ఈ కుటుంబం అంటే గ్రామంలో ప్రత్యేకమైన గౌరవం, మర్యాద. ఇటువంటి కుటుంబంలో జన్మించాడు కాబట్టి సుభాష్‌కు చిన్నప్పటి నుంచి రాదు, కాదు, లేదు, నేను చెయ్యను లాంటి వ్యతిరేక భావం కలిగిన మాటలు భావాలు లేని వ్యక్తిగా పేరు గాంచాడు.

సుభాష్ ఎంబిఏ చదువుతున్న రోజుల్లో మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నపుడు తన తల్లి, తండ్రి ఆటోలో వెళ్తుండగా ఆటో ప్రమాదానికి గురైంది. అసలే ఆర్థిక కష్టాల్లో వున్న కుటుంబం, పరీక్షలు.. ఆ సమయంలో ప్రమాదం జరిగిన చోటికి వెంటనే చేరుకోగా, తల్లి, తండ్రి ఇద్దరూ స్పృహ లేని పరిస్థితిలో వున్నారు. వారిని ఆసుపత్రిలో చేర్పించి, తన పరీక్షలు రాస్తూ వున్నపుడు అతనికి జీవితం విలువ అంటే ఏమిటో అప్పుడు బాగా అర్థమైంది. అదృష్ట వశాత్తు తల్లిదండ్రులకు పెద్ద ప్రమాదమేమీ జరగలేదు కాబట్టి కొద్ది రోజుల్లోనే వారు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. సంపాదించే తండ్రి మంచాన పడటం, తన చదువు, కుటుంబ బాధ్యత వీటన్నిటి నడుమ చదువును కొనసాగించి మొత్తానికి ఎంబిఏ పూర్తి చేశాడు. ఆ తర్వాత అప్పుడే పోలీసు శాఖలో ఎస్సై ఉద్యోగాల ప్రకటన రావటంతో ఎలాగైనా ఎస్సై పోస్టు సాధించాలని కష్టపడి అన్ని రకాల శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణుడు అయ్యాడు కానీ, ఎంత కష్టపడి చదివినా వ్రాత పరీక్షల్లో ఒక దాంట్లో ఉత్తీర్ణుడు కాక పోవటంతో తన కల నెరవేరకుండా పోయింది. మళ్ళీ ప్రకటన వస్తే ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధిద్దాం అనుకుంటున్న పరిస్థితుల్లో ఆంధ్ర – తెలంగాణ ఉద్యమం కారణంగా అప్పుడు ఎటువంటి ఉద్యోగాల నియామకానికి చెందిన ప్రకటనలు వెలువడలేదు. ఇలా గడుస్తోంది సుభాష్ జీవితం.

### పల్లెసృజనతో పరిచయం.....

సుభాష్ అన్న ధనుంజయ్ ఇన్నోవేటర్. అతను ఒక మల్టీ పర్పస్ వ్యవసాయ యంత్రం తయారీకి ఒక నమూనా తన మదిలో ఉండటంతో దాని గురించి 2013లో తరచూ అతను 'పల్లెసృజన' కార్యాలయానికి వెళ్ళి బ్రిగేడియర్ గణేశం గారిని కలుస్తూ ఉండేవాడు. ఒకసారి ఇతను కూడా తన అన్నతో పాటు బ్రిగేడియర్ గారిని కలవటం జరిగింది. అప్పుడే పల్లెసృజన నూతన కార్యాలయం ప్రారంభం కావటం, అక్కడ మేనేజర్‌గా ఒక వ్యక్తిని నియమించాల్సి రావటం జరిగింది. ఆ ఉద్యోగంలో ధనుంజయ్ తమ్ముడు సుభాష్‌ను నియమిస్తే అతనికి కాస్త తోడ్పాటు అందించినట్లు అవుతుంది, అనుకుని బ్రిగేడియర్ గణేశం, మిగతా సభ్యులు దుర్గాప్రసాద్, శ్రీకర్‌లు కూడా ఆలోచించి ఇతన్ని నియమించటం జరిగింది. అంతకు ముందు తమ బంధువుకు చెందిన ఒక సంస్థలో ఉద్యోగం చెయ్యటం, ఆ ఉద్యోగంలో రోజువారి లెక్కలు, బ్యాంకుకు చెందిన పనులు, సిబ్బంది ప్రయాణానికి సంబంధించిన

టికెట్లను బుక్ చెయ్యటం, ఉద్యోగ రీత్యా గ్రామాల సందర్శన లాంటి పనులు చేయటంలో మంచి అనుభవం ఉండటంతో ఈ ఉద్యోగానికి అవన్నీ మంచి అనుభవాలుగా కలిసి వచ్చి, బాగా ఉపయోగ పడ్డాయి.

ఆ తర్వాత పల్లెసృజన ఇన్నోవేటర్లు బ్రిగేడియర్ గారితో 'మా ఇన్నోవేషన్లకు మంచి ప్రచారం తెస్తున్నారు కానీ వాటిని మేము మాత్రమే అమ్మటం వల్ల మాకు పెద్దగా లాభం రావటం లేదు, మీరు కూడా మార్కెటింగ్‌లో సహాయం అందిస్తే మా జీవితాలు బాగుంటాయి' అన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా "క్రియేటివ్ మైండ్స్" అనే ఒక సంస్థను 'పల్లెసృజన'కు అనుబంధ సంస్థగా ఏర్పాటు చేసి, పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను విక్రయించాలని నిర్ణయించారు. ఈ సంస్థను మొదట దుర్గా ప్రసాద్ గారు సిఇఓ గా, సుభాష్‌ను ఈ సంస్థకు 'ఎజిఎం'గా వ్యవహరించమన్నారు.

ఈ సంస్థ పనుల్లో మొదటి పనిగా అప్పుడే వెలుగులోకి వచ్చిన 'గోదాసు నర్సింహా' అనే ఇన్నోవేటర్ తయారు చేసిన 'గుర్రపు డెక్క నిర్మూలన యంత్రం' సహాయంతో హైదరాబాద్ తిరుమల గిరి సమీపం లోని 'ఆర్‌కె పురం చెరువు'లో గుర్రపు డెక్కను నిర్మూలించే పనిని హైదరాబాద్ నగర పాలక సంస్థ 'పల్లెసృజన'కు అప్పగించింది. ఈ పనిని క్రియేటివ్ మైండ్స్ ద్వారా సుభాష్ చేపట్టడం జరిగింది.

**జిహెచ్ఎంసి అనుభవం.....**

అలా తన అన్న సహాయంతో పల్లెసృజనలో అడుగు పెట్టి, జిహెచ్ఎంసి వారు అప్పగించిన ఆర్‌కె పురం చెరువును శుభ్రం చేసే బృహత్ కార్యాన్ని నిర్వహించే బాధ్యత చేపట్టడం జరిగింది. ఆ పనిని విజయ వంతంగా పూర్తి చేయటం, చెరువు శుభ్రం చేసే పనికి అవసరమైన కూలీలతో పని చేయించటం, మున్సిపల్ కార్యాలయానికి చెరువు పని పురోగతిని వివరిస్తూ ఉండటం, కూలీలకు బట్వాడాలు, మున్సిపల్ కార్యాలయంలో బిల్లులు తీసుకు రావటం, ఆ పనులకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు 'పల్లెసృజన'కు తెలియ జేయటం లాంటి పనులను పూర్తి చేయటంలో ప్రముఖ పాత్ర పోషించటం జరిగింది. ఇలా మూడు సంవత్సరాల పాటు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి మొత్తానికి చెరువును శుభ్రం చేసి, ఆ ప్రాంత వాసులు తమవద్ద ఇంత అందమైన చెరువు ఉందా అనేట్లుగా చెరువును సుందరంగా తీర్చి దిద్దటం జరిగింది.

**ఎన్ఐఎఫ్ - ఐడిసి - పల్లెసృజన:**

ఆ తర్వాత నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారి సహాయంతో 'పల్లెసృజన' ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ డిఫ్యూజన్ సెంటర్' (ఐడిసి)





ద్వారా ఎంతో మంది ఇన్నోవేటర్లు తయారు చేసిన పరికరాల అమ్మకాలు బాగా జరిగి, అవి సమాజంలో మంచి పేరును గడించటం జరిగింది. ఈ పరంపరలో రాష్ట్రంలోని పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఐడిసి ని చూపించటం, ఇన్నోవేషన్లను, వాటిని తయారు చేసిన ఇన్నోవేటర్ల సాధక బాధకాలు వివరించటం తో 'పల్లెసృజన' కార్యాలయం ఎప్పుడూ సందర్శకులతో కళకళలాడుతూ వచ్చింది. ఈ ప్రదర్శన ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ఇన్నోవేషన్ల మీద అవగాహన కల్పించటం జరిగింది. ఐడిసి నిర్వహణ బాధ్యత సుభాష్ గత పదేళ్ళుగా నిర్వహిస్తున్నాడు.

**గ్రాస్ రూట్స్ ఎంటర్ ప్రెన్యూర్ లను తయారు చెయ్యటం:**

ఈ కార్యక్రమం ఒక్క పల్లెసృజన కార్యాలయంలో ప్రదర్శించి తెలియజేయటం కాదు, ఇది విస్తృతంగా జరగాలి అన్న ఉద్దేశ్యంతో నాటి సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి చేరాలి అన్న ఉద్దేశ్యంతో అక్కడక్కడా వీటిని ప్రదర్శించాలి అని నిర్ణయించటం జరిగింది. ఈ విధంగా 2017వ సంవత్సరంలో ఈ రకమైన కొత్త వ్యాపార దృక్పథాన్ని ప్రారంభించటం ద్వారా 'క్రియేటివ్ మైండ్స్' ఒక మంచి భావాలు కలిగిన వ్యాపార సంస్థగా రూపు దిద్దుకుంది. ఈ వ్యాపార దృక్పథం యొక్క ప్రధాన ఉద్దేశ్యం .....

- రైతుల కోసం రైతులు తయారు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను సమాజానికి పరిచయం చెయ్యటం.
- ఇన్నోవేటర్లకు లబ్ధి చేకూర్చటం, వారి ఇన్నోవేషన్లను మార్కెటింగ్ చేసే అవకాశం కల్పించటం.
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూర్చే ఇన్నోవేషన్లను అందరి దరికి చేర్చటం.
- గ్రామీణ స్థాయి ఇన్నోవేషన్లను జాతీయ స్థాయికి చేర్చటం.
- విద్యార్థులకు ఇన్నోవేషన్ల మీద అవగాహన కల్పించటం.
- పునాది స్థాయి ఇన్నోవేటర్లను బలోపేతం చెయ్యటం

ఇలా బహుముఖ ప్రయోజనాల రూపకల్పనతో ఐడిసి రూపొందించిన కార్యక్రమాలు విజయవంతంగా ప్రజల్లోకి చేరాయి. ఈ పరంపరలో ఇప్పటి వరకు 400కు పైగా ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, అనేక రాష్ట్రాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేయటం జరిగింది. ఇలా ఇప్పటి వరకు పల్లెసృజన ద్వారా 500 కు పైగా ఇన్నోవేషన్లను డాక్యుమెంటేషన్ చేసి, 110కి పైగా ఇన్నోవేషన్లను మార్కెట్ లోకి తీసుకు

రావటంలో సుభాష్ నిర్వహించిన పాత్ర ఎంతో ప్రశంసనీయమైనది.

ఈ కార్యక్రమాల ద్వారా ఎన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలతో కలిసి మార్కెటింగ్ చేసే అవకాశం లభించింది. ఈ కార్యక్రమాల వల్ల దాదాపు 35 మంది ఇన్నోవేటర్లు వారి స్వగ్రామాల్లోనే వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసుకుని, తమ ఇన్నోవేషన్లను తయారు చెయ్యటం ద్వారా గ్రామాల్లో ఉద్యోగాల కల్పన, ఇన్నోవేటర్లకు ఆర్థిక పరిపుష్టి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రశంసలు, పురస్కారాలు లభించేలా చేయటంలో 'క్రియేటివ్ మైండ్స్' పాత్ర అనిర్వచనీయమైనది.

**ఐఆర్ఎంఎ జాతీయ సంస్థలో ప్రజంటేషన్:**

ఇలా జాతీయ స్థాయి సంస్థలతో అనుసంధానంలో భాగంగా 2019లో 'జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆనంద్' (ఐఆర్ఎంఎ), గుజరాత్ వారి ఆహ్వానం మేరకు అక్కడ ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో సుభాష్ పాల్గొన్నాడు. అందులో 'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' ప్రతినిధిగా హాజరు కావడం ఒక గొప్ప అవకాశం. అక్కడ సుభాష్ గ్రాస్ రోట్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పైన చేసిన ప్రజంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌లలో మొదటి వాడివి. ఇది సమాజానికి ఉపయోగ పడే ఒక మంచి మాడల్‌అని అక్కడి డైరెక్టర్లు సుభాష్‌ను అభినందించారు.

**పాఠశాలలు, కళాశాలలతో అనుభవం:**

ఇలా తన ప్రస్థానంలో ఇప్పటి వరకు 110 ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తీసుకు రాగలిగాడు, సుమారు 400కు పైగా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్స్ ఎగ్జిబిషన్‌లను నిర్వహించాడు. 200కు పైగా పాఠశాలలు, 40కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల్లో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై లెక్చర్ ఇవ్వటం జరిగింది. ఈ విధంగా ఏర్పడిన అనుబంధంతో 2013లో తన ప్రస్థానం 'పల్లెసృజన'తో మొదలైతే, 2017లో "సంగీత" ని వివాహం చేసుకుని సంసార జీవితం ప్రారంభించాడు. 2018లో ఒక పాప, 2020లో ఒక బాబు జన్మించారు

**వీక్లీ వెబినార్ లు:**

2020లో యావత్ ప్రపంచం 'కరోనా' కోరల్లో చిక్కుకుని ఎవ్వరూ బయటకు వెళ్ళలేని పరిస్థితుల్లో ఇన్నోవేషన్ల విస్తృతి కుంటు పడకుండా, నిరంతరాయంగా సమాజానికి అందించాలన్న దృక్పథంతో సుభాష్ చందర్ 'వీక్లీ వెబినార్' కార్యక్రమం నిర్వహించాడు. ఇలా 100 వరకు వెబినార్లు అర్థవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎందరో మహానుభావులు పాల్గొని కొత్త శోభను తీసుకు వచ్చారు. 200కు పైగా ఇన్నోవేటర్లను, 300కి





పైగా ఇన్నోవేషన్లను, 150కి పైగా ముఖ్య అతిథులను సమాజానికి పరిచయం చెయ్యటం జరిగింది. నిరంతరంగా కరోనా సమయంలో కూడా గ్రాస్‌రూట్స్ ఇన్నో వేషన్లను సమాజానికి పరిచయం చెయ్యడం సాధ్యమైంది.

**చిన్న శోధయాత్రలు:**

'పల్లెసృజన' పునాది స్థాయి ఇన్నోవేషన్లను వెతికేందుకు 'చిన్న శోధయాత్ర'లను నిర్వహిస్తుంది. ప్రతి మూడు మాసాలకు ఒకసారి మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలలో పాదయాత్ర ద్వారా జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, అధ్యాపకులు పాల్గొంటారు.

ఈ శోధయాత్ర జరిగే ప్రదేశాన్ని ముందుగా గుర్తించి, ఆ యాత్రికులు ఒకచోట సమావేశం అయ్యేలా చేయటం, వారి యాత్ర మార్గ నిర్దేశకత్వం, వారు ఎక్కడ భోజనాలు చెయ్యాలి, ఎక్కడ నిద్రించాలి లాంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసే బృందం పని చెయ్యటంలో సుభాష్ పాత్ర అనిర్వచనీయమైనది. ఇలా ఇప్పటికి 45 శోధ యాత్రలను నిర్వహించటం జరిగింది. అందులో దాదాపు 20కి పైగా శోధ యాత్రల్లో తాను కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నాడు సుభాష్ చందర్.

ఇలాంటి బృహత్కర కార్యక్రమంలో తాను ప్రధాన పాత్ర వహించటం, దాదాపు 50-60 మంది ఇన్నోవేటర్లకు నేరుగా వారి ఇన్నోవేషన్లను మార్కెటింగ్ చెయ్యటంలో ప్రముఖ పాత్ర వహించటం తనకెంతో సంతృప్తిని ఇస్తోందని అంటాడు సుభాష్ చందర్. మౌనంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, ఏ బ్యాంకు లేదా సంస్థల ఆర్థిక సహకారం లేకుండా ఇంతటి వ్యాపారం నిర్వహించటంతో పాటు, ఎంతో మందికి తలలోని నాలుక లాగా వ్యవహరిస్తున్న సుభాష్ చందర్ ఎంతో అభినందనీయుడు.

'పల్లెసృజన' విలువలను అవగాహన చేసుకొని, స్వచ్ఛందంగా ఇన్నోవేటర్లకు సహాయం చెయ్యాలని, వారి ఉత్తమ ఆవిష్కరణలు సమాజంలో అవసరమైన వారికి అందుబాటులో ఉండేట్లుగా అందించాలన్న తపన ఉన్న సుభాష్ చందర్ ధన ప్రాప్తే ఉద్దేశ్యంగా అయోమయంలో ముందుకు సాగుతున్న ప్రస్తుత యువతకు ఒక మంచి మార్గదర్శి. సమాజ లాభం, ఇన్నోవేటర్లకు తోడు, శాంతితో కూడుకున్న జీవనం. ఇలాంటి జీవనపథం అందరికీ లభ్యం కాదు. ధైర్యం కావాలి. సహృదయం, సత్ప్రవర్తన, సదుద్దేశ్యాలు, సమాజాన్ని గౌరవించే లక్షణాలు అత్యవసరం. సుభాష్ చందర్‌ను భగవంతుడు ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది. ●

**సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఆహారంలో షడ్రుచులు - ఆరోగ్య ప్రాముఖ్యత



ఉమా మహేశ్వర రావు

మనం రోజూ తినే ఆహారంలో 'షడ్రుచులు' ఉండేలా చూసుకుంటే చాలావరకు సాధారణంగా వచ్చే జబ్బుల నుండి కాపాడుకోవచ్చు. 'తీపి, చేదు, వగరు, కారం, ఉప్పు, పులుపు' వీటినే షడ్రుచులు అంటాం. ఆహారం తీసుకునేటపుడు ఏ ఆహారం యే సమయంలో తీసుకోవాలో కూడా శాస్త్రీయాల్లో వివరించారు. ఈమధ్య కాలంలో వీటిని చెప్పే వారు లేక అవన్నీ మరుగున పడిపోతున్నాయి. సాధారణంగా శుభ కార్యాలలో విస్తర్లో ఆహారం వడ్డించేటపుడు పూర్వం వీటినే వడ్డించే వారు. ఇప్పుడు కూడా షడ్రుచుల ఆహారం వండుతున్నారు, వడ్డిస్తున్నారు కానీ, వాటిని తీసుకునే క్రమం సరిగ్గా పాటించటం లేదు.

ఆహారం తీసుకునేటపుడు 'తీపి' పదార్థాన్ని ముందుగా తీసుకోవాలి. ఎందుకంటే ఆ మధురం నోట్లోకి వెళ్ళగానే నోట్లో నీళ్ళు ఊరి లాలాజలం ఎక్కువగా తయారు అవుతుంది. లాలాజలం ఎక్కువగా ఉంటే, దాన్ని మించిన యాంటీ బయాటిక్ ప్రపంచంలో లేదు అన్న విషయం గుర్తుంచుకోవాలి. ఈ లాలాజలం ఎక్కువగా కడుపులోకి వెళ్తే మనం తినే ఆహారం కూడా తేలిగ్గా అరుగుతుంది. ఇక రెండోది ఆమ్లము అంటే 'పులుపు'. ఇది ఆకలిని కలిగించటానికి ఉపయోగ పడే పదార్థము, అజీర్ణము రాకుండా చూసుకుంటుంది. తర్వాత 'లవణము' అంటే ఉప్పు. ఒక్కోసారి వంటల్లో ఉప్పు తక్కువ అయినప్పుడు అవసరమైనంత ఉప్పును కలుపుకుంటూ ఉంటారు. అప్పుడు ఆహారం రుచి పెరుగుతుంది. ఈ ఉప్పుకు కూడా తేలిగ్గా అరిగించే గుణం ఉంటుంది. ఆ తర్వాత 'చేదు' చర్మ వ్యాధుల నుండి నివారించటంతో పాటు, చర్మం కాంతివంతంగా ఉండేలా చేస్తుంది, అలర్జీ లాంటివి ఉండవు. తర్వాత 'కటు' అంటే కారం ఆకలిని పుట్టిస్తుంది, కఫం పెరగకుండా తగ్గిస్తుంది. కఫం పెరిగితే దగ్గు, తుమ్ములు, ఆయాసం లాంటివి వస్తాయి. చాలామంది గమనించే ఉంటారు. తినే ఆహారంలో కారం కొద్దిగా ఎక్కువ అయినట్లయితే నోరు మంటగా ఉండి లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. దాన్ని యథాలాపంగా మింగేస్తూ ఉంటాము. ఈ రకంగా కూడా తిన్న ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది కారం. తర్వాత కషాయం అంటే 'వగరు'. ఇది కడుపులో వున్న చాలా వరకు రోగాలను కలిగించే దోషాలను తొలగించి వేస్తుంది. అందుకే దాదాపు ప్రతి కార్యాలలో, హెూటళ్ళలో 'రసం' తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ రసం చాలా వరకు షడ్రుచులు ఉండేలా చూస్తారు. ఈ విషయం తెలిసిన కొందరు రసం అన్నంలో కలుపుకుని తినటంతో పాటు, కొంత రసాన్ని చేతిలో వేసుకుని నోట్లోకి నేరుగా తీసుకుంటూ ఉంటారు. అంటే రసం మన శరీరంలోని చాలా రకాల రోగ ప్రక్రియలను ఆదిలోనే అంతం చేసేస్తుందన్నమాట. అందుకే ముఖ్యంగా ఈ వర్షాకాలం (ముసురు) ఉన్నప్పుడు తప్పకుండా ఆహారం లో రసం ఉండేలా చూసుకోవటం మంచిది.



కాబట్టి షడ్రుచులతో కూడిన ఆహారం ఎవరైతే ఆహారంలో తప్పకుండా ఉండేలా చూసుకుంటూ ఉంటారో, వాళ్ళకి దాదాపు ఎటువంటి మందులతో పని లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. అందుకే మన పూర్వీకులు 'ఉగాది' పండుగ రోజున షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి ఉండేలా చేశారు కాబట్టి తప్పకుండాదీన్ని తీసుకోవాలి అంటారు. మన అదృష్టం ఏమిటంటే ఇవన్నీ మనకు ప్రకృతి సహజంగా లభించేవే. ఈ అవకాశం అన్ని దేశాల్లో ఉండటం అరుదు. మనకు మాత్రం ప్రకృతి ప్రసాదంగా ఇవి ఎల్లప్పుడూ లభిస్తూ ఉంటాయి. ఉదాహరణకు, ఉసిరి, యాలకులు, మామిడి కాయ (ఇందులో వగరు, పులుపు రెండూ ఉంటాయి), ఉప్పు బదులు సైంధవ లవణం వాడితే మంచిది. చింత పండు – దీనికి బదులుగా ఉసిరి, మామిడి, నిమ్మ కూడా ఉపయోగించుకోవచ్చు. ఇవన్నీ మనకు సులభంగా లభించే పదార్థాలు.

ఆహారంలో పుదీన, బూడిద గుమ్మడి, మారేడు, వెల్లుల్లి, సునాముఖి, పారిజాతం, చుక్క కూర, జాజికాయ లాంటి వాటిని ఉపయోగిస్తూ ఉండటం మంచిది. పుదీన చట్నీ చేసుకుని తింటే అందులో కొత్తిమీర, కరివేపాకులను కూడా వేస్తారు కాబట్టి ఈ చట్నీ తినటం ద్వారా చర్మ వ్యాధులు దరిచేరకుండా ఉండే అవకాశాలెక్కువ. పుదీన ఆకులను మెత్తగా దంచి, రసం తీసి, అందులో కాస్త నిమ్మరసం, కాస్త తేనె కలుపుకుని రోజుకు రెండు చెంచాలు తీసుకుంటూ ఉన్నట్టైతే అజీర్తి అనేది దరిచేరదు. కొందరు మహిళలు గర్భం దాల్చినపుడు ఎక్కువగా వాంతులు అవుతూ ఉంటాయి, వీటినే కొన్ని ప్రాంతాల్లో 'బైకలు' అంటారు. ఎన్ని రకాల మాత్రలు వేసుకున్నా వాంతులు తగ్గవు. అటువంటి వారు ఈవిధంగా చేసినట్లయితే వాంతులు త్వరగా తగ్గే అవకాశం ఎక్కువ.

అలాగే 'బూడిద గుమ్మడి' అప్పుడప్పుడూ ఆహారంగా తీసుకుంటూ ఉన్నట్లయితే మన శరీరంలో రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతూ ఉంటుంది. గుమ్మడికాయ రసం తీసి, అందులో ఉసిరికాయ లేదా నిమ్మరసం కలుపుకుని తాగినట్లయితే మనం గతంలో ఏవైనా మాత్రలు వాడటం వల్ల కడుపులో వచ్చే ఎన్నో రకాల సైడ్ ఎఫెక్ట్ లకు సంబందించిన చాలా వరకు దోషాలను బయటకు పంపేలా చేస్తుంది. మొలల వ్యాధితో బాధ పడేవారు ఈ రసం తీసుకున్నట్లయితే మొలల బాధ నుండి విముక్తి పొందవచ్చు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# వర్షాకాలంలో విరివిగా కనిపించే మొక్కలతో వైద్య చిట్కాలు

## అత్తిపత్తి :

'అత్తిపత్తి' అనే మొక్క గ్రామీణ వాతావరణంలో వున్న వారికి దాదాపు అందరికీ తెలిసినదే. ఈ మొక్క వర్షాకాలంలో చాలాచోట్ల కనిపిస్తూ వుంటుంది. దీని ఆకులు ఎవ్వరైనా సరే అలా ముట్టుకోగానే ముడుచుకు పోతాయి. ఈ మొక్కను కొన్ని ప్రాంతాల్లో 'నిద్ర గన్నిక' అని కూడా అంటారు. దీన్ని ఆంగ్లంలో 'టచ్ మీ నాట్' అని అంటారు. ఈ మొక్క చాలా రకాల వైద్య గుణాలు కలిగినది. అందులో కొన్నింటిని గురించి వివరణ.

## మొలల వ్యాధి నివారణకు అత్తిపత్తి తో ఔషధం:

అత్తిపత్తి మొక్క ఆకులను చేకరించి, నీడలో బాగా ఆరబెట్టి తర్వాత వాటిని రోట్లో వేసి మెత్తగా దంచి చూర్ణంలాగా తయారు చెయ్యాలి. ఆ చూర్ణాన్ని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఆ చూర్ణాన్ని 3 గ్రాముల మోతాదులో తీసుకుని అందులో తగినంత బెల్లం కలుపుకుని రోజుకు మూడుసార్లు నోట్లో వేసుకోవాలి. ఇలా ఒక మండలం (41 రోజులు) పాటు తప్పకుండా తీసుకున్నట్లయితే మొలలు నివారించబడి బాధ నుండి విముక్తి పొందుతారు. చూర్ణంలో ఒకేసారి బెల్లం కలిపి పెట్టుకుంటే మంచిది కదా అని అనుకుంటారు కొందరు. అలా చేయకండి. అలా చేసినట్లయితే ఆ చూర్ణం కొద్ది రోజులకు పుల్లటి వాసన వచ్చి, తినటానికి కాస్త ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి ఏ రోజుకు ఆ రోజు బెల్లం కలుపుకుని తీసుకుంటే మంచిది. కావాలంటే ఆ రోజుకు అవసరమైనంత చూర్ణంలో బెల్లం ఒకేసారి కలిపి పెట్టుకుని మూడు పూటలా సేవించవచ్చు.

## మహిళల్లో 'ఎర్రబట్ట వ్యాధి' నివారణకు మందు :

చాలా మంది మహిళలు 'తెల్లబట్ట' అనే వ్యాధితో బాధ పడుతూ ఉంటారు. దాని నివారణకు గర్భ సంచి తొలగించే శస్త్ర చికిత్స చేయించుకోవటం లేదా మందులు వాడటం లాంటివి చేస్తూ ఉంటారు. అతి కొద్ది మంది మహిళల్లో ఇలాగే 'ఎర్రబట్ట' అనే వ్యాధి కూడా వస్తూ వుంటుంది. ఈ ఎర్రబట్ట వ్యాధి వచ్చిన వారికి మాంసం కడిగిన నీళ్ళ లాగే ద్రవం స్రవిస్తూ వుంటుంది, ఇది చాలా దుర్వాసన కూడా కలిగి వుండటంతో చాలా ఇబ్బందిగా కూడా ఉంటుంది. ఈ ఎర్రబట్ట వ్యాధి నివారణకు అత్తిపత్తి ఆకులను సేకరించి, నీటిలో బాగా కడిగిన తర్వాత వాటిని చూర్ణంలాగా తయారు చేసుకోవాలి. ఈ చూర్ణానికి సమానంగా ఆయుర్వేద ఔషధాలు, మూలికలు అమ్మే దుకాణాల్లో 'నాగ కేసరములు' అని లభిస్తాయి వాటిని తెచ్చుకుని వాటిని కూడా చూర్ణంగా తయారు చేసుకోవాలి. ఈ రెండు చూర్ణాలను వేరువేరు సీసాల్లో భద్రపరచుకొని ఉంచుకోవాలి. తరువాత ప్రతి రోజూ రోజుకు మూడు పూటలు రెండు చూర్ణాలను కలిపి ఒక చెంచాడు తీసుకుని నోట్లో వేసుకుంటూ ఉండాలి. ఇలా మండలం పాటు తీసుకున్నట్లయితే 'ఎర్రబట్ట' వ్యాధి నివారించ బడుతుంది. మహిళ శరీర తత్వాన్ని బట్టి ఒక వారం పది రోజులు ఎక్కువైనా సరే తీసుకోవటం మంచిది. దీనివల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు కాబట్టి ఆ వ్యాధి తగ్గే వరకు తీసుకుంటూ ఉండాలి.



'వైద్య' కొమెర జాజి



## నీళ్ళ విరోచనాల నివారణకు అత్తిపత్తి :

నీళ్ళ విరోచనాలు అవుతున్న చిన్న పిల్లలయినా, పెద్దవాళ్ళు అయినా సరే వాటి నివారణకు అత్తిపత్తి మొక్క సమూలంగా వేర్లతో సహా తీసుకు వచ్చి, ఆ మొక్కను నీడలో బాగా ఆరబెట్టి పొడి చేసుకుని చూర్ణం లాగా తయారు చేసి ఉంచుకోవాలి. ఆ చూర్ణం ఒక చెంచాడు తీసుకుని అందులో తేనె లేదా బెల్లం కొద్దిగా కలుపుకొని తీసుకుంటూ ఉన్నట్లయితే నీళ్ళ విరోచనాలు తగ్గిపోతాయి.

## పుండ్లు, గాయాలు రసి లేదా చీము కారుతున్నా సరే వాటి నివారణకు:

ఏ విధంగానైనా ప్రమాద వశాత్తు గాయాలు తగిలి, అవి మానిపోక గాయాలు రసి లేదా చీము కారుతున్న పుండ్లు ఉన్న వాళ్ళు అత్తిపత్తి ఆకులను తీసుకుని మెత్తగా నూరి చూర్ణంలాగా తయారు చేసుకోవాలి, ఆ తర్వాత అందులో కొద్దిగా పసుపు వేసి మళ్ళీ బాగా కలిసి పోయేలా నూరుకోవాలి. ఆ తర్వాత ఆ చూర్ణాన్ని గాయాలకు పైన పెట్టి దానిపైన ఒక తమలపాకు లేదా ఏదైనా ఆకును పెట్టి ఒక మెత్తటి గుడ్డను కట్టుకోవాలి. ఇలా ప్రతి రోజూ రాత్రి కట్టు కట్టి ఉదయమే తీసివేస్తూ ఉండాలి. ఇలా చేస్తూ వున్నట్లయితే ఎంతటి రసి, చీము కారే పుండ్లు అయినా సరే చాలా త్వరగా తగ్గిపోతాయి.

## వరి బీజం వ్యాధి నివారణకు అత్తిపత్తితో వైద్యం:

వరిబీజం వ్యాధితో బాధ పడుతున్న వారు అత్తిపత్తి ఆకులను సేకరించి వాటిని శుభ్రంగా కడిగి, రోట్లో వేసి మెత్తగా నూరి పేస్టులాగా తయారు చెయ్యాలి. ఆ పేస్టును ఒక తమలపాకు పైన పెట్టి వరీ బీజానికి క్రింద భాగంలో పెట్టి ఒక గుడ్డతో 'లంగోట' లాగా బిగుతుగా కట్టు కట్టాలి. ఇలా రోజుకు మూడు లేదా నాలుగు సార్లు చేయాల్సి ఉంటుంది. ఇలా ఒక వారం రోజులు చేసినట్లయితే వరిబీజం వ్యాధి నయమై పోయి వరి బీజాలు మామూలు స్థాయికి చేరుకుంటాయి.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.


'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

# 'నేల ఉసిరి' మొక్కతో ఆరోగ్య ప్రయోజనాలు

'నేల ఉసిరి' మొక్క పంట పొలాల్లో బీడు భూముల్లో విరివిగా మొలిచే మొక్క. దీన్ని 'భూమి ఆమ్ల' అని కూడా అంటారు. 'ఉసిరి' కాయలు పులుపు, వగరు, తీపి కలగలిపిన రుచులతో ఉంటుంది, వీటితో పచ్చళ్లు పెట్టుకుంటూ ఉంటాము. ఈ నేల ఉసిరి మొక్క భూమి నుండి ఒకటి రెండు అడుగుల ఎత్తులో గుబురుగా పెరిగే మొక్క. దీనివల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. దీని కాయలు చేదుగా ఉంటాయి. ఈ మొక్క ఆకులు ఉసిరి చెట్టు ఆకుల్లాగే చిన్నవిగా ఉంటాయి, ఆకులు కూడా చేదుగా ఉంటాయి. దీని కాయలు ఆకు యొక్క ఈనె వెంట బుడిపెల్లాగా కాయలు కాస్తాయి. ఆకులు ఎండిన తర్వాత క్రిందకు రాలి మళ్ళీ మొక్కలుగా పునరుత్పత్తి అవుతూ ఉంటాయి. కాబట్టి ఈ నేల ఉసిరి గింజలు లేదా కాయలు సేకరించాలంటే మొక్క మొత్తం తీసుకోవలసి ఉంటుంది. ఈ నేల ఉసిరి మొక్కను కాండము వద్ద నుండి కోసి నీడలో ఆరబెట్టుకుని పొడిగా చేసుకుని నిలువ ఉంచుకుంటే ఇందులో ఔషధ గుణాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఎండలో ఆరబెట్టడం వల్ల కొంత వరకు ఔషధ గుణాలు తగ్గిపోతాయి కాబట్టి దీన్ని నీడలోనే ఆరబెట్టుకోవాలి. ఈ పొడి రెండు సంవత్సరాల వరకు ఉపయోగించుకోవచ్చు. ఆ తర్వాత ఇందులోని ఔషధ గుణాలు తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

ఈ నేల ఉసిరి పొడిని శరీరంలో గ్లూకోజ్ పరిమాణం పెరిగుతోంది అనిపించినపుడు ఉదయం, సాయంత్రం ఒక చెంచాడు పొడిని తీసికొని ఒక గ్లాసు నీటిలో కలుపుకుని త్రాగినట్లయితే గ్లూకోజ్ లెవెల్స్ చాలా వరకు తగ్గిపోతాయి. ఈ పొడి చాలా చేదుగా ఉంటుంది కాబట్టి శరీరంలోని తీపి కారకాలను అంతరింప జేస్తుంది.

పూర్వం దీన్ని కాలేయ సంబంధ వ్యాధుల నివారణకు విరివిగా ఉపయోగించే వారు. నేల ఉసిరి మొక్కను తీసుకుని, పచ్చి మొక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి, రోట్లో వేసి మెత్తగా దంచి, ఆ ముద్దను ఒక మెత్తటి గుడ్డలో వేసి పిండినట్లయితే రసం వస్తుంది. ఆ రసాన్ని 30 మి.లీ. తీసుకుని అందులో చిటికెడు మిరియాల పొడి కలుపుకుని రోజూ ఉదయం పరగడుపుననే మూడు రోజుల పాటు తీసుకున్నట్లయితే కాలేయ సంబంధ వ్యాధులు, పచ్చ కామెర్ల వ్యాధి తగ్గిపోతుంది. ఇలా తీసుకోవటం వల్ల కిడ్నీలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి, కిడ్నీ లో ఏర్పడ్డ చిన్న చిన్న రాళ్ళు కూడా బయటకు వెళ్ళిపోతాయి. ఈ నేల ఉసిరిని ఆరబెట్టుకుని పొడిగా చేసుకుని తీసుకున్నా, పచ్చి మొక్కను రసంగా చేసుకుని తీసుకున్నా కాలేయ వ్యాధులు, మధుమేహం, పచ్చ కామెర్ల వ్యాధులు కేవలం మూడు నాలుగు రోజుల్లోనే నయం అవుతాయి. కిడ్నీలో ఏర్పడిన రాళ్ళ సమస్యను కూడా చాలా వరకు తొలగిస్తుంది.



నేల ఉసిరి



బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

ఏ వ్యాధులు లేనివారైనా సరే మూడు నెలలకు లేదా ఆరు నెలలకు లేదా సంవత్సరానికి ఒకసారి మూడు రోజుల పాటు పరగడుపున దీని రసాన్ని తీసుకుంటూ ఉన్నట్లయితే చాలా వరకు ఆరోగ్య సమస్యలు దరిచేరే అవకాశాలు తక్కువ, మనిషి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీన్ని ఉపయోగించటం వల్ల జ్వరం లాంటివి కూడా రాకుండా నివారిస్తుంది, గాయాలు అయిన వారికి అవి వెంటనే తగ్గేలా చేస్తుంది. రక్తశుద్ధి కూడా బాగా జరుగుతుంది. ఇంకా ఎన్నో లాభాలు కూడా ఉంటాయి కాబట్టి దీన్ని అందరూ ఉపయోగించ వచ్చు. దీన్ని వాడటం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు.

అయితే ఈ ఔషధం ఉపయోగించేటపుడు 'సప్పిడి పత్యం' చేయటం మంచిది. అంటే వేడి అన్నంలో కొద్దిగా కారం పొడి వేసుకుని దొండకాయ, బెండకాయ, బీరకాయ, సొరకాయ లాంటి ఎక్కువ వాతము లేని కూరగాయలతో కూరలు చేసుకుని కలుపుకుని తినాలి.

వంకాయ, గోంగూర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పొట్ల కాయ, చిక్కుడు, బీన్స్, మాంసాహారాలు లాంటి వాతము కలిగిన ఆహారాన్ని ఆ మూడు రోజుల పాటు తీసుకోకుండా ఉంటే మంచిది. ఇలా చేసినట్లయితే నేల ఉసిరి వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు. ●



**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.: 6303903400**

గణేశం గారికి,

జులై 29వ తేదీన ఈటీవీలో ప్రసారమైన కార్యక్రమంలో 'పల్లెసృజన' రథసారథి స్వచ్ఛమైన చిరునవ్వుతో మాట్లాడిన ఆణి ముత్యాలు కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించడం జరిగింది. ఆ కార్యక్రమంలో తమరు మాట్లాడిన అంశాలలో నాకు నచ్చిన కొన్నింటిని సమయంతో సహా వివరిస్తున్నాను.

❀ ఆర్మీలో మంచి కోసం మారుతారు, దేశం కోసం మారుతారు, స్వార్థం కోసం కాదు.
❀ ప్రకృతిని స్నేహితుడిగా చూడాలి.
❀ సమాజం పెరగాలి అంటే ఇన్నోవేషన్లు పెరగాలి.
❀ జ్ఞానానికి కాళ్ళు లేవు, మనకున్నాయి.
❀ పల్లెలకు, పట్టణానికి మధ్య వంతెన 'పల్లెసృజన'.
❀ కొత్తగా నేర్చుకోవాలి అంటే 'సున్నా' కావాలి.
❀ గమ్యం లేదు అందుకే అపజయాలు లేవు.
❀ ఆంధ్ర – తెలంగాణ విడిపోయినా, మేము విడిపోలేదు.
❀ ఇతరుల బాధను మన బాధగా అనుకుని చలించడమే 'సంవేదన'.
❀ జ్ఞానం కోసం వెళ్ళేదే 'చిన్న శోధయాత్ర' ఇదో తీర్థ యాత్ర.
❀ బాధలు ఎప్పుడు చెప్పుకోరు, వారితో కూర్చున్నప్పుడు ఆత్మీయతతో చెప్పుకుంటారు.
❀ పల్లెసృజన వాలంటీర్లు రేపు దేశాన్ని మారుస్తారు.
❀ ఇన్నోవేషన్లు గుడిసెల్లో తయారవుతాయి. ల్యాబ్‌ల్లోనే కాదు.
❀ గ్రామాలు భగవంతుడు సృష్టిస్తే, పట్టణాలను మనుషులు తయారు చేశారు.
❀ పల్లెసృజనను చూసి మరికొన్ని సంస్థలు వచ్చి దేశాన్ని మారిస్తే ఆనందంగా పైకి పోతా.

మీరు మాట్లాడిన ఈ మాటలు నాకు ఆణిముత్యాలులా అనిపించాయి, అప్పుడే సమయం అయిపోయిందా? అనిపించింది.

**– మీ జాజి,** కారంపూడి, పల్నాడు జిల్లా.

జాజి గారు, మీరు కార్యక్రమాన్ని ఇంత నిశితంగా పరిశీలించటంతో 'పల్లెసృజన' ఇంటర్వ్యూకు సార్థకత ఏర్పడింది. సమాజంలో ఒక్కరు మారినా చాలు అన్న తృప్తి మాకు మిగిలింది. ధన్యవాదములు. **– ఎడిటర్**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# మినీ మిల్లర్



ఇన్నోవేటర్
**వినయభూషణ్ రెడ్డి**
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## బియ్యంతో పాటు చిరు ధాన్యాలు కూడా పట్టవచ్చు

ధాన్యం పండించిన తర్వాత మార్కెట్‌లో ధర లేదని తెలిసి, బియ్యం చేసి అమ్ముదామంటే సమీపంలో రైస్ మిల్లు లేనివారు ఎంతమంది ఉన్నారు.
గ్రామానికి ఒక్కటి ఈ మినీ రైస్ మిల్లును ఏర్పాటు చేసుకుంటే గ్రామంలోని ధాన్యం మొత్తం మర ఆడించి నాణ్యమైన బియ్యం అమ్ముకుని లాభాలు పొందవచ్చు.
ఈ మినీ రైస్ మిల్లు వరితో పాటు కొర్రలు, అండు కొర్రలు, ఊదలు, బరిగలు కూడా బియ్యం పడుతుంది.
గోధుమలకు కూడా పై పొట్టు తీస్తుంది.
కేవలం 12 అడుగుల పొడవు వెడల్పు వున్న గది చాలు దీన్ని ఏర్పాటు చేసుకోవటానికి. ఖరీదు కూడా సామాన్యులకు అందుబాటులోనే ఉంటుంది.





వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

పల్లెసృజన పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఆవిష్కరణలు NABARD

# ఎలక్ట్రిక్ వీడర్



ఇన్నోవేటర్
**అంజయ్య**
జగిత్యాల జిల్లా, తెలంగాణ

## ఛార్జింగ్ చెయ్ - కలుపు తీసెయ్

రోజురోజుకూ పెరిగి పోతున్న ఇంధనం ధరల నుండి రైతుకు విముక్తి కలిగించేదే 'ఎలక్ట్రిక్ వీడర్'.
3 గంటలు ఛార్జింగ్ చేస్తే 2 ఎకరాల వరకు సునాయాసంగా అంతర సేద్యం చేసుకోవచ్చు. ఇంజన్ బరువు తక్కువగా ఉంటుంది కాబట్టి బరువు కొరక ఒక రాయి లేదా ఇసుక బస్తా వేసుకుంటే సరిపోతుంది. తేలికపాటి నేలలకు ఎంతో అనుకూలమైనది.
నేల ఉలిపసిమిగా వుంటే ఈ వీడర్‌తో కలుపు తీయడం ఎంతో సులభం.
ఒకే చక్రంతో ఏర్పాటు చేయబడింది కాబట్టి జొన్న, మొక్కజొన్న, వేరుశనగ లాంటి తక్కువ వెడల్పు వున్న సాళ్ళలో కూడా సునాయాసంగా అంతర సేద్యాలు చేసుకోవచ్చు. పొలం పనులతో పాటు, ధాన్యం ఆరబెట్టుకోవటానికి కూడా ఎంతో అనువుగా పని చేస్తుంది.
దీనికి సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవచ్చు. అప్పుడు ఎంతసేపైనా సరే సేద్యం చేసుకోవచ్చు. దీనికి స్ప్రేయర్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

PALLE SRUJANA Telugu Bi-monthly July-August 2023 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన


## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023

లేదా

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

**సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)**

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 640/- | 1,240/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.